PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 111 | విజయవాడ, శనివారం 22 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 22 November 2025 | Rs

కార్మిక హక్కులు హరించడమే

- లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌పై కార్మిక సంఘాల ఆగ్రహం
- 26న దేశవ్యాప్త నిరసనలకు పిలుపు

7



పంత్ కెప్టెన్సీకి పరీక్ష...

- నేటినుంచి దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్
- ఉదయం 9.00గం॥ల నుంచి

8

కార్మిక హక్కులపై శరాఘాతం

అమలులోకి వచ్చిన లేబర్ కోడ్స్

న్యూఢిల్లీ : కార్మిక సంఘాలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు, నిరసనలను బేఖాతరు చేస్తూ లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన చేసింది. తక్షణమే కోడ్‌లను అమలులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొంది. దీంతో వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020) శుక్రవారం నుండే అమలులోకి వచ్చాయి. అనంతరం ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్‌లో చేసిన పోస్టులో దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్న ఈ కోడ్‌లను 'స్వాతంత్ర్యానంతరం చేపట్టిన సమగ్ర కార్మిక, ప్రగతిశీల సంస్కరణలు'గా పేర్కొన్నారు. 'ఇవి కార్మికులకు మరింత సాధికారత కల్పిస్తాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సులభతరం చేయడంతో పాటు దానిని ప్రగతి బాట పట్టిస్తాయి' అని కూడా ప్రధాని తెలిపారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా కూడా కార్మిక కోడ్ల అమలుపై ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే, మోడీ ప్రభుత్వం చెబుతున్న విధంగా కోడ్‌లు కార్మికుల జీవన స్థితిగతులను ఏ మాత్రం మార్చలేవని, వీటి కారణంగా కార్మికుల పని గంటలు పెరుగుతాయని, కార్మికుల సంక్షేమానికి బదులు ఇవి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తున్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికులకు హానికరమైనవని సీపీఐ (ఎం) గతంలోనే చెప్పింది.

'వేతన' నిర్వచనంతో ప్రభావం

కేంద్రం తీసుకొచ్చిన కార్మిక కోడ్లు 'వేతనాలు' అనే పదానికి కొత్త నిర్వచనం ఇచ్చాయి. బోనస్, ఇంటి అద్దె అలవెన్స్, రవాణా భత్యం, కమిషన్ మిగతా 7లో



విశాఖలో లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు (వార్త 2లో)

నేడు నిరసనలకు సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున నిరసనలు తెలియజేయాలని, నోటిఫై చేసిన ఉత్తర్వులను దగ్ధం చేసి నిరసనలు తెలియజేయాలని కార్మికులకు, కార్మిక సంఘాల నాయకులకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి మాత్రమే బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని మరోసారి తేటతెల్లమైందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనం కోసం 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని చెప్పారు. బీహార్ ఎన్నికల అనంతరం నోటిఫై చేయడంతో తన కుటిలత్వాన్ని బయటపెట్టుకుందని, మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై, లేబర్ కోడ్‌ల రద్దుకు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక వర్గానికి సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

మార్చి 16 నుంచి 'టెన్త్' పరీక్షలు

- 7 పేపర్లలో నిర్వహణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు (2025-26 విద్యా సంవత్సరం) మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు కెవి శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. ఏడు పేపర్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. 50 మార్కులకే ఉన్న ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకే జరుగుతాయని పేర్కొన్నారు.

పదో తరగతి షెడ్యూల్

తేదీ	సబ్జెక్ట్
16-03-2026 (సోమవారం)	మొదటి భాష (పేపర్-1)
18-03-2026 (బుధవారం)	రెండవ భాష
20-03-2026 (శుక్రవారం)	ఇంగ్లీష్
23-03-2026 (సోమవారం)	మేథమెటిక్స్
25-03-2026 (బుధవారం)	ఫిజికల్ సైన్స్
28-03-2026 (శనివారం)	బయోలాజికల్ సైన్స్
30-03-2026 (సోమవారం)	సోషల్ స్టడీస్
31-03-2026 (మంగళవారం)	ప్రథమ భాష పేపర్-2, (కంపోజిట్ కోర్సు) ఒఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1
01-04-2026 (బుధవారం)	ఎస్ఎస్‌సి వొకేషనల్ కోర్సు



వైద్యశాఖ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పిపిపి ఆస్పత్రుల్లో పేదలకు 70శాతమే

- 30 శాతం పడకలు ప్రైవేటుకు
- ఏప్రిల్ నుండి యూనివర్సల్ హెల్త్ స్కీమ్
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న పిపిపి వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రులలో పేదలకు 70 శాతం పడకలను మాత్రమే కేటాయించనున్నారు. ప్రైవేటుకు మిగిలిన 30 శాతం పడకలను అప్పగించనున్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సిల్ హెల్త్ స్కీంలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు 'కొత్త మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో 70శాతం మేర పడకలు పేదలకు ఉచితంగా కేటాయిస్తున్నాం' అని ఆయన చెప్పారు. అంటే, ఈ 70 శాతం పడకల మేర మాత్రమే ఉచిత వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో 100శాతం మేర పేదలకు ఉచిత వైద్య సేవలు అందుతున్న విషయం తెలిసిందే. సమీక్షలో సిఎం మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు పిపిపి విధానంలో చేపడుతున్నా పర్యవేక్షణ, అజమాయిషీ మాత్రం ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. ఈ కళాశాలల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులను అధ్యయనం చేయాలన్నారు. రోగులకు మెరుగైన, నాణ్యమైన సేవలు సులభంగా అందాలని, ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం పనిచేసేలా చూడాలని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న యూనివర్సిల్ హెల్త్ ఇన్సూరెన్స్ విధానాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తేవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ వ్యాధికి ఎంత వ్యయం చేస్తున్నామో విశ్లేషించాలని సూచించారు. ప్రజారోగ్యంలో ప్రివెంటివ్, క్యురేటివ్ విధానం ద్వారా వైద్యారోగ్యం రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంతో పాటు ప్రజల వ్యక్తిగత వ్యయం కూడా తగ్గేలా చూడాలని పేర్కొన్నారు. కుప్పంలో పైలట్‌గా అమలు చేస్తున్న డిజినెర్వ్ సెంటర్ సంజీవని ప్రాజెక్టు రాష్ట్రానికి ఓ గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, వైద్య రంగంలో దేశానికి ఓ దిక్సూచిగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తామని కుప్పం ప్రాజెక్టుపై అధికారులు సిఎంకు వివరించారు. జనవరి 1 నుంచి చిత్తూరు మొత్తం సంజీవని ప్రాజెక్టు ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రమంతా కూడా ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు సమర్థంగా అమలు చేస్తే వైద్యరంగంలో ప్రభుత్వం చేసే వ్యయం గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించేందుకు ఓ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్న ఈ సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన రూపాయి..

- డాలర్‌తో పోల్చితే రూ.89.61కి క్షీణత
- ఒక్క పూటలోనే 93 పైసలు ధమాల్
- భారత చరిత్రలోనే ఆల్‌టైం కనిష్ట స్థాయి



ఏడాది	రూపాయి విలువ
2014	62.33
2015	66.79
2018	70.64
2020	74.31
2022	81.62
2025	89.61

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ కుప్పకూలి పోయింది. భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో వారాంతంలో 89.61కి పతనమయ్యింది. అమెరికా, భారత్ మధ్య చోటు చేసుకుంటున్న టారిఫ్ ఆందోళనలు, దేశీయ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి రూపాయి విలువను అగాథంలోకి నెట్టింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భారత ఐటి కంపెనీలకు ప్రతికూల నిర్ణయాలు ఉండొచ్చనే భయాలతో ఐటి షేర్లు ఒత్తిడిని ఎదుర్కోవడమూ రూపాయిపై ప్రభావం చూపాయి.

శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 93 పైసలు పతనమై 89.61 దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.67 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 89.65 అత్యల్ప స్థాయికి పడిపోయింది. గురువారం సెషన్‌లోనూ 20 పైసలు విలువ కోల్పోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 30న ఇంట్రాడేలో 88.85 కనిష్ట స్థాయిని తాకింది. అక్టోబర్ 14న 88.81 ఆల్‌టైం పతనాన్ని చవి చూసింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ఒకే పూటలో అత్యధికంగా జులై 30న 89 పైసలు క్షీణించింది.

'ఇప్పటి వరకు భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత రాకపోవడం, అంతర్జాతీయంగా మార్కెట్లలో విశ్వాసం సన్నగిల్లింది. క్రిప్టో కరెన్సీల్లో భారీగా అమ్మకాలు తదితర అంశాలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయి' అని కోటక్ సెక్యూరిటీస్‌లో కరెన్సీ, రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ పేర్కొన్నారు.

రూపాయి విలువ పతనం మిగతా 7లో

కేరళలో ఎస్ఐఆర్‌పై స్పందించండి

- ఎన్నికల కమిషన్‌కు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుండగా, అదే సమయంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సర్వే నిర్వహించాలని ఇసి ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సిపిఎం, ఇతర రాజకీయ పార్టీలు దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎస్ఐఆర్‌ను పొడిగించాలనే పిటిషనర్ల ప్రధాన డిమాండ్‌పై విడిగా విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. బీహార్ ఎస్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకుని, 26వ తేదీన కేరళ రాష్ట్రం నుండి వచ్చిన పిటిషన్లను మాత్రమే వివరంగా విచారిస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఎన్నికల కమిషన్ 26వ తేదీలోపు ఈ పిటిషన్లపై తన సమాధానం దాఖలు చేయాలని ఆదేశించింది. కేరళ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్... స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్న సమయంలోనే ఎస్ఐఆర్‌ను ప్రారంభించడంతోపాటు ముగించాలని ఎన్నికల కమిషన్ లక్ష్యంగా పెట్టుకుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియతోపాటు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పరిపాలనా ఇబ్బందులకు కారణమవుతోందని, అధికారులపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోందని ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రధాన వాదన. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయన మిగతా 7లో

సిజెఐగా చివరి పనిదినం పూర్తిచేసిన గవాయ్



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ శుక్రవారం తన చివరి పనిదినాన్ని పూర్తి చేశారు. ఈ నెల 23న ఆయన పదవీ విరమణ చేయనుండగా, 24న జస్టిస్ సూర్యకాంత్ 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టులోని 1వ నెంబరు కోర్టు గది కిక్కిరిసింది. సిజెఐ బెంచ్ కార్యకలాపాల సందర్భంగా శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ జస్టిస్ గవాయ్ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారని ప్రశంసించారు. చట్టం అమలు పట్ల దృఢమైన వైఖరిని అవలంభించారని, అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా తన పట్ల గౌరవ సూచకంగా పూల వర్షం కురిపించేందుకు ఒక న్యాయవాది ప్రయత్నించగా... జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుని, ఎవరికైనా వాటిని ఇవ్వాలని, కింద పడేయవద్దని అన్నారు.

దుబాయ్ ఎయిర్‌షోలో కూలిన తేజస్ ఫైటర్ జెట్

- పైలట్ మృతి

న్యూఢిల్లీ : దుబాయ్ ఎయిర్‌షోలో భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఫైటర్ జెట్ శుక్రవారం కూలి పోయింది. ఈ ప్రమాదంలో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. దుబాయ్‌లోని అల్ మఖ్తుమ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విన్యాసాలు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా కూలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన పైలట్ మరణించడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నామని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వాయుసేన ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొంది. నెగిటివ్ జీ-ఫోర్స్ టర్న్ నుంచి పైలట్ యుద్ధ విమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 17న ప్రారంభమైన దుబాయ్ ఎయిర్ షో - 2025లో వివిధ దేశాల నుంచి వంద వైమానిక దళ బృందాలు పాల్గొనగా, భారత్ నుంచి 3 తేజస్ యుద్ధవిమానాలు, సిబ్బంది పాల్గొన్నారు. స్వదేశీ టెక్నాలజీతో తయారైన తేజస్ 24 ఏళ్ల క్రితం 2001 జనవరి 4న ఐఎఎఫ్‌లోకి అడుగు పెట్టింది. 2024 మార్చి 12న జైసల్మేర్‌లో శిక్షణనిస్తుండగా తేజస్ కూలిపోగా, ఇది రెండో ప్రమాదం.

కళాశాలల్లో ఆత్మహత్యల నివారణకు ఐదుగురితో కమిటీ

- విద్యాశాఖ సమీక్షలో మంత్రి లోకేష్

7



కాంక్రీట్ లిఫ్ట్ బకెట్ పడి ఉపాధ్యాయిని మృతి

- అనకాపల్లిలో దారుణం

3

నిరాయుధుల్ని పట్టుకుని కాల్చి చంపారు

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మారేడుమిల్లి, రంపచోడవరం ఎన్‌కౌంటర్లు బూటకమని, నిరాయుధులైన కేంద్ర కమిటీ సభ్యులు మాడ్వి హిడ్మా, ఎఒబి రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్, రాజేలతోపాటు పలువురు మావోయిస్టులను పోలీసులు పట్టుకెళ్లి కాల్చి చంపారని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో ఉద్యమాన్ని ముందుకు కొనసాగిస్తామని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ఈ నెల 23న దేశవ్యాప్త నిరసన దినంగా పాటించాలని ప్రజలను కోరారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు హిడ్మా, అతని సహచరిణి రాజే కొద్దిమంది వ్యక్తులతో కలిసి వైద్యం కోసం విజయవాడ వెళ్లారని, చికిత్స పొందుతున్న క్రమంలో కొందరు చేసిన ద్రోహం వల్ల వారి సమాచారం పోలీసులకు చేరిందని తెలిపారు. కేంద్ర హోం శాఖ డైరెక్షన్లో ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబి ఈ నెల 15న వారిని అదుపులోకి తీసుకుని లొంగదీసుకునేందుకు ప్రయత్నించి విఫలమై క్రూరంగా హతమార్చిందని పేర్కొన్నారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ జరగడం, వారి వద్ద ఆయుధాలు దొరకడం పచ్చి అబద్ధమని తెలిపారు. రంపచోడవరం ఎన్‌కౌంటర్ కూడా బూటకమని పేర్కొన్నారు. చివరి వరకు ఉద్యమంలో కొనసాగి శత్రువుకు తలవంచకుండా ప్రాణాలర్పించారని తెలిపారు. ఆర్ఎస్ఎస్-బిజెపి మనువాదులు అభివృద్ధి ముసుగులో దేశ సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పజెప్పుతున్నారని పేర్కొన్నారు. మతోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, ఎన్నికల కమిషన్ మోడీకి గోది కమిషన్‌గా మారిందని విమర్శించారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలను మొత్తం నిర్మూలించి బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థను సైతం ధ్వంసం చేసే పథకంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బిజెపి మనువాదులకు వ్యతిరేకంగా, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు సాగే పోరాటాల్లో కార్మికులు, రైతులు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అభయ్ కోరారు.

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- టన్ను రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

2

మూడేళ్లలో 17 లక్షల ఇళ్లు

- ప్రతి మూడు నెలలకొకసారి సామూహిక గృహ ప్రవేశాలు
- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

కృష్ణాజలాల ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండి

ముఖ్యమంత్రికి జగన్‌మోహన్‌రెడ్డి లేఖ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణాజలవివాదాల ట్రిబ్యునల్-2 విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాసిన లేఖను శుక్రవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. ఈ లేఖలో కృష్ణజలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులు కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ముందు పేలవవాదనలు వినిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్ అందుకు ప్రత్యక్ష ఉదాహరణని తెలిపారు. జలాలపై హక్కులను వాడుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయం ఇచ్చిన తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని పేర్కొన్నారు. దీన్ని సమీక్షించడం చట్టవిరుద్ధమని రెండో ట్రిబ్యునల్ అభిప్రాయపడిందని తెలిపారు. కేంద్రం 2023 అక్టోబర్ ఆరోతేదీన ఇచ్చిన టిఓఆర్ ప్రకారం ఇప్పుడు విచారణ జరగుతోందని పేర్కొన్నారు. నదిలో లభ్యమయ్యే నికర జలాలు 811 టిఎంసిలు కేటాయింపునకు సంబంధించి కెడబ్ల్యుడిటి-2 విచారణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు. నదిలో 763 టిఎంసిలు కేటాయించాలని వాదన చేస్తున్న తెలంగాణా ట్రిబ్యునల్-2 ముందూ అదే వాదనలు వినిపిస్తోందని పేర్కొన్నారు. ఎపి కూడా తుదివాదనలు వినిపించే అవకాశం ఉందన్నారు. గతంలో ఇచ్చిన ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సమీక్షించేందుకు అవకాశం లేదని, ఇదే విషయాన్ని రెండో ట్రిబ్యునల్ 2013 నవంబరు 29న నివేదిక సమర్పించిందని గుర్తు చేశారు. పైగా వాటిని సమీక్షించడం అంటే గందరగోళానికి తెరదీయడమేననీ పేర్కొన్నారు. 2014లో పునిర్విభజన చట్టం క్లాజ్-4 ప్రకారం కృష్ణానది, గోదావరి నదులకు ధర్మాసనం కేటాయించిన నీటిని యథాతథంగా కొనసాగించాలని మార్పు ఉండకూదని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర నదీజలాల చట్టం 1956లో సెక్షన్ 6(2), పునర్విభజన చట్టం 2014లో మిగతా 7లో

మూడేళ్లలో 17 లక్షల ఇళ్లు

- ప్రతి మూడు నెలలకొకసారి సామూహిక గృహ ప్రవేశాలు
- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాబోయే మూడేళ్ల కాలంలో 17లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం గృహనిర్మాణశాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి 5లక్షల ఇళ్లు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. హౌసింగ్ ఫర్ ఆల్ అనే కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి ఉద్యోగులందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై)0.1 హౌసింగ్ స్కీమ్‌లోని ఎస్‌సి ఎస్‌టి, బిసి, పివిటిజి వంటి సామాజిక వర్గాలకు అదనంగా చెల్లింపులు జరుపుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. తాజాగా ముస్లిం మైనార్టీలకు అదనంగా రూ.50వేలవంతున ఒక్కో ఇంటికి చెల్లింపులు చేయనున్నట్లు స్పష్టం చేశారు.



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఇందుకోసం 18వేల ముస్లిం మైనార్టీల లబ్ధిదారులకు రూ.90 కోట్లు అవసరమవుతాయన్నారు. ఆయా వర్గాలకు చేకూరుస్తున్న అదనపు సహాయాన్ని వారికి వివరించాలని అధికారులకు సూచించారు. హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమం అమలులో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, ప్రస్తుతం గుర్తించిన లబ్ధిదారులే కాకుండా ఇంకా అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు సర్వే చేస్తున్నట్లు సిఎం తెలిపారు. సర్వేను త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. జాబితాను గ్రామాల వారీగా ప్రదర్శించాలన్నారు. గృహ నిర్మాణాల్లో భాగంగా ఎవరైనా స్థలం అడిగితే వారికి ఇవ్వాలని, అలాగే తమకు స్థలాలు ఉన్నాయని చెబితే వాళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతి అప్‌డేట్ ఆన్‌లైన్‌లో ఉంచాలని , ఇక ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించే విధంగా ఇళ్లనిర్మాణాలను చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

పెండింగ్ బిల్లుల కోసం కేంద్రంతో సంప్రదింపులు :

2014-19 మధ్య కాలంలో చేపట్టిన ఎన్‌టిఆర్ రూరల్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి కొందరికి బిల్లులు రాకుండా గత ప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరించిందని చంద్రబాబునాయుడు అన్నారు. ఆయా లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లులు రూ. 920కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ బిల్లులకు సంబంధించిన నిధులు రాబట్టేలా అధికారులు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వం ఇదే తరహాలో నరేగా బిల్లులను కూడా ఆపేసిందన్నారు. ఆయా బిల్లులను తమ ప్రభుత్వం స్ట్రీమ్ లైన్‌లో పెట్టి బిల్లులు వచ్చేలా చేశామన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ,రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, టిడ్కో, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏలూరు ఆర్‌టిసి డిపో పరిధిలోని రిటైల్ ఆయిల్ లేఅవుట్ విభాగంలో ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అసలు దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎపిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్యతో సహా మరో ఇద్దరు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని తప్పించి సంబంధం లేని వారిని ఇరికించడం దుర్మార్గమన్నారు.

ప్రజాశక్తి మేడికొండూరు విలేకరి మృతి

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్ (పల్నాడు

గుంటూరు జిల్లా మేడికొండూరు మండల ప్రజాశక్తి విలేకరి దావల వెంకట్రావు (50) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. మేడికొండూరు మండలం డోకిపర్రుకు చెందిన ఆయన 2009 సెప్టెంబర్ నుండి ప్రజాశక్తిలో పనిచేస్తున్నారు. ఫొటోగ్రాఫర్‌గానూ మండల ప్రజలందరికీ చిరపరిచితుడైన వెంకట్రావుకు భార్య అరుణ, కుమారుడు చందు, కుమార్తెలు అనూష, ప్రమీల ఉన్నారు. పెద్ద కుమార్తె, కుమారునికి గతంలోనే వివాహం చేయగా, చిన్న కుమార్తె ప్రమీల వివాహం గత గురువారమే జరిగింది. బుధవారం వెంకట్రావు ఇంటి వద్ద పెళ్లి కుమార్తెను చేసే వేడుకను నిర్వహించారు. గురువారం రాత్రి పెళ్లి అనంతరం వెంకట్రావు కుటుంబీకులంతా ఇంటికి చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తూ ఆయన కింద పడిపోయారు. గమనించిన కుమారుడు చందు వాహనంలో పేరేచర్లలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



వెంకట్రావు (ఫైల్)

అనంతరం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. భౌతికకాయాన్ని ప్రజాశక్తి సిబ్బంది, మీడియా ప్రతినిధులు సందర్శించి పూలమాలలేసి నివాళు లర్పించారు. వెంకట్రావు మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్ జి.శివరామకృష్ణ సంతాపం తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా తెనాలిలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల కథనం ప్రకారం... తెనాలి పట్టణానికి చెందిన ఆరేళ్ల బాలిక 2021 జనవరి ఒకటిన బహిర్భూమి నిమిత్తం ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలోకి వెళ్లింది.

అదే ప్రాంతానికి చెందిన బిళ్లా డేవిడ్‌రాజు ఆ బాలిక వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. కేసును అప్పటి డిఎస్‌పి కె.స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో నర్సరావుపేట దిశా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి యు.రవిచంద్ర దర్యాప్తు చేశారు. కేసు విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.

జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలిక కుటుంబానికి రూ.4 లక్షల ప్రభుత్వ సాయం నెల రోజుల్లోగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలినేని రాఘవయ్య వాదనలు వినిపించారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలి

- విశాఖలో జిఒ కాపీలు దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు పూనుకోవడాన్ని ఖండిస్తూ సిఐటియు విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం జగదాంబ జంక్షన్‌లో జిఒ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి కుమార్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ పి మణి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసే విధంగా కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం కార్మిక చట్టాలు ఉన్నప్పటికీ అమలుకాక కార్మికులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని వివరించారు. ఇప్పుడు లేబర్ కోడ్స్ అమలు జరిగితే పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఫిక్స్‌డ్ టెర్మ్ విధానం ప్రమాదకరమైందని తెలిపారు. పెట్టుబడిదారుల లాభాల కోసం కార్మికులను బలిచ్చేందుకే లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తున్నారని విమర్శించారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతీశ్వరరావు, బి జగన్, ఎం సుబ్బారావు, లక్ష్మణమూర్తి, ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, బి వెంకటరావు పాల్గొన్నారు.

కొత్త సిఎస్ ఎవరో!

- ఎక్కువగానే ఆశావహులు
- ప్రస్తుత సిఎస్‌ను కొనసాగించే అంశంపైనా చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి కొత్త చీఫ్ సెక్రటరీగా ఎవరు రాబోతున్నారన్నదానిపై విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుత సిఎస్ విజయానంద్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండడంతో ఆయన స్థానంలో కొత్త సిఎస్‌ను నియమించాల్సి ఉంటుంది. ఈ పదవి కోసం ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారుల9 మధ్య పోటీ నెలకొంది. అయితే ప్రస్తుతం స్పెషల్ సిఎస్‌గా ఉన్న సాయిప్రసాద్‌కే ఎక్కువ అవకాశాలున్నాయని తెలుస్తోంది.

గతేడాది సిఎస్‌గా విజయానంద్ బాధ్యతలు స్వీకరించారు. అయనకన్నా సీనియర్లను కూడా కాదని ఈ పదవిని 1992 బ్యాచ్‌కు చెందిన విజయానంద్‌కు కట్టబెట్టారు. అప్పట్లో శ్రీలక్ష్మి, సాయిప్రసాద్, అజయ్‌జైన్, ఆర్‌పి సిసోడియాలు విజయానంద్‌కన్నా సీనియర్లు. ప్రస్తుతం వీరిలో గవర్నర్ కార్యాలయంలో స్పెషల్ సిఎస్‌గా ఉన్న అనంతరాము, ఇరిగేషన్ శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎక్స్ అఫీషియో స్పెషల్ సిఎస్‌గా ఉన్న సాయిప్రసాద్, గృహ నిర్మాణశాఖ స్పెషల్ సిఎస్‌గా పనిచేస్తున్న అజయ్‌జైన్‌ల పేర్లే కొత్త సిఎస్ నియామకానికి వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురులో అనంతరాము (1990) సీనియర్ అయినప్పటికీ సాయిప్రసాద్‌కే అవకాశాలు మెండుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే ప్రస్తుత సిఎస్ విజయానంద్‌కు మరో మూడు నెలలపాటు కొనసాగింపు ఇచ్చే అవకాశాలున్నాయని కూడా చర్చ జరుగుతోంది. సిఎస్ బాధ్యతలతోపాటు అత్యంత కీలకమైన ఇంధన శాఖ బాధ్యతలను కూడా ఆయనే నిర్వహిస్తున్నారు. ఒకవేళ ఆయనకు పొడిగింపు లేకపోతే కొత్తగా సాయిప్రసాద్‌ను సిఎస్‌గా నియమించి, విజయానంద్‌కు ఇంధన రంగానికి చెందిన కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఎపిఇఆర్‌సి చైర్మన్ పదవిగానీ, ఇంధనశాఖ సలహాదారు పదవిగానీ ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే ఎపిఇఆర్‌సి చైర్మన్ పదవికన్నా సలహాదారు పదవి ఇస్తేనే విద్యుత్ రంగంలో ఆయన సేవలను ఎక్కువగా వినియోగించుకునే అవకాశాలుంటాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- టన్ను రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి- బుక్కరాయసముద్రం (అనంతపురం జిల్లా)

అరటి రైతులను ఆదుకోవాలని, టన్ను అరటిని రూ.15 వేలకు తగ్గకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి గ్రామంలో అరటి తోటలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా నాయకులు వి.శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్రతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. గిట్టుబాటు ధరలేక తోటల్లో పంటను వదిలేసిన రైతులతో మాట్లాడారు. బాధిత రైతు హనుమంతు మాట్లాడుతూ నాలుగున్నర ఎకరాల్లో అరటి సాగు చేయడానికి ఐదున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని, రూ.45 వేల మాత్రమే చేతికి వచ్చాయని వాపోయారు. మూడు ఎకరాల్లో పంట సాగు చేస్తే కూలీల ఖర్చు కూడా రాలేదని మరో రైతు చిన్న ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు రాకపోవడంతో మూడు ఎకరాల్లోని అరటి పంటను పొలంలోనే వదిలేశానని నారాయణస్వామి అనే రైతు తనగోడు వెల్లబోసుకున్నారు.



పొలంలోనే పంటను వదిలేసిన అరటి తోటను పరిశీలిస్తున్న సిపిఎం, రైతు సంఘం, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు

అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 వేల ఎకరాల్లో అరటిని రైతులు సాగు చేశారన్నారు. గిట్టుబాటు ధరలేక కోట్ల రూపాయల పెట్టుబడిని నష్టపోతున్నారని తెలిపారు. రాయలసీమ ఉద్యాన హబ్ అని ప్రభుత్వాలు మాటలు చెప్పడమే తప్ప, కష్టాల్లో ఉన్న రైతులవైపు కన్నెత్తి చూడడంలేదన్నారు. గతేడాది నవంబరులో కిలో అరటి రూ.22 ఉంటే, ప్రస్తుతం రెండు నుండి మూడు రూపాయలకు కూడా కొనేవారు కరువయ్యారని తెలిపారు. చేతికొచ్చిన పంటను గిట్టుబాటు ధర లేక గొర్రెలు, పశువుల మేతకు వదిలేస్తున్నారన్నారు. అరటి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తే కిలో ఆరు రూపాయలకు తగ్గకుండా కొనాలని వ్యాపారులను కలెక్టర్ ఆదేశించినా పంటను కొనేవారు లేరన్నారు. జిల్లా నుంచి అరటి గల్ఫ్ దేశాలకు ఎగుమతయ్యే స్థితి నుండి రోడ్లపై పడేసే స్థితికి పరిస్థితి దిగజారిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ట్రంపు ఆదేశాలకు తలొగ్గి ఎగుమతులను నిలిపివేయడంతో పొగాకు, పత్తి, అరటి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తమకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని మెప్మా ఆర్‌పి ఉద్యోగులు కర్నూలు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో చేపట్టారు. ఆర్‌పిల సంఘం జిల్లా అధ్యక్షులు రుద్రమ్మ అధ్యక్షతన నిర్వహించిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు, ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ ఉమాదేవి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె అరుణలు మాట్లాడారు. ఆర్‌పిలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారు కనీస వేతనం కూడా అమలు చేయడం లేదన్నారు. ఒక్కో ఆర్‌పికి నెలలో రూ.800, రూ. 2000, రూ.3000, రూ. 4000 ఈ రకంగా వేతనాలు అందుతున్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రేడింగ్ విధానాన్ని రద్దుతో పాటు అభయ హస్తం కోసం కట్టించుకున్న డబ్బులు చెల్లించాలని,



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆర్‌పిల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్య ఎండి.అంజిబాబు

లేదా 45 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.2000 పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఆర్‌పిల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సిఐటియు నగర అధ్యక్షులు వై నగేష్ నగర నాయకులు, వి వెంకటేశ్వర్లు, ఆర్‌పిల సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీబాయి, షబానాలు మాట్లాడారు. సిఐటియు నాయకులు రియాజ్‌బాషా, ఆర్‌పిల సంఘం జిల్లా ట్రెజరర్ సుజాత, ప్రసాద్, కన్యక, నాగేశ్వరి, సంధ్యారాణి, మంజుల, శ్రీదేవి, సుజాత, జ్యోతి, పొదుపు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు పోస్టింగులివ్వాలి

- డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం 2022 నవంబరులో 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తుచేశారు.

పరీక్షలు నిర్వహించి 95,208 మందిని ఎంపిక చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో వీరికి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించగా, 40 వేల మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. జూన్‌లో మెయిన్ పరీక్షలు నిర్వహించి ఆగస్టులో ఫలితాలు విడుదల చేసిందన్నారు. మెడికల్ పరీక్షలు సైతం నిర్వహించి రెండు నెలలు గడిచిందని తెలిపారు. ఇప్పటికీ పోస్టింగులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికే అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆర్భాటం కోసం నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

9 అర్బన్ లోకల్ బాడీలకు మరో 6 నెలలు ప్రత్యేకాధికారుల పాలన పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 9 అర్బన్ లోకల్ బాడీలకు స్పెషల్ ఆఫీసర్ల పాలనను ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక పాలన 2026 మే 5 వరకు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇందులో రాజాం, రాజమండ్రి, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు అర్బన్ లోకల్ బాడీలు ఉన్నాయి. తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి


- యాత్రికులకు చాక్లెట్లు పంచిన ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని శుక్రవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ముందుగా పద్మావతి విశ్రాంతి భవనం నుంచి బయల్దేరిన ఆమె తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ భూవరాహస్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతిని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి సాదరంగా ఆహ్వానించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇష్టికాఫల్ స్వాగతం పలికింది. ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం తిరుమల శ్రీవారిని రాష్ట్రపతి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. చైర్మన్, ఇఒలు శ్రీవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను, టిటిడి 2026 కేలండర్‌ను, డైరీలను రాష్ట్రపతికి అందజేశారు. ఆమె వెంట రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, భానుప్రకాష్‌రెడ్డి, సివిఎస్‌ఒ మురళీకృష్ణ పాల్గొన్నారు. శ్రీవారి దర్శనానంతరం పద్మావతి అతిథి గృహానికి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... రాంభగీచ బస్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన నిల్చున్న యాత్రికులను పలకరించారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ప్రజలతో మమేకమయ్యారు. తన కాన్వాయ్ ఆపి మరి అక్కడ ఉన్న వారిని కలిశారు. వారికి చాక్లెట్లను పంచారు. ఆలయం వెలుపల ఫొటో దిగుతామంటూ టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి కోరగా రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి రామనారాయణరెడ్డితోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్రపతితో కలిసి ఫొటో దిగారు. సమీపంలోనే ఉన్న ఇఒ సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్‌లను రాష్ట్రపతి పిలవడంతో వారూ వచ్చి ఫొటో తీయించుకున్నారు. తిరుపతి, తిరుమల రెండు రోజుల పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

సాగర్ కుడి కాలువకు గండి

ప్రజాశక్తి- కారంపూడి (పల్నాడు జిల్లా)



పల్నాడు జిల్లా కారంపూడి మండలం వినుకొండ రోడ్డులోని నాగార్జున సాగర్ సాగర్ కుడి కాలవకు గురువారం అర్ధరాత్రి గండిపడింది. గుర్తు తెలియని వ్యక్తులు కాలువకు గండికొట్టారని అధికారులు భావిస్తున్నారు. ఎస్కేప్ ఛానల్ వద్ద కాలువ కట్టకు గండిపడడంతో నాగులేటి ప్రవాహం పెరిగి ఒక్కసారిగా 20 గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. ఈ వాగుకు ఆనుకుని వీరుల తిరునాళ్ల నేపథ్యంలో వ్యాపారులు కాలువకు సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేశారు. అందులోని మూడు దుకాణాలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వాటిలోకి నీరు చేరింది. వాగు ఉధృతి పెరగడంతో ప్రజలు స్థానిక నాయకుల ద్వారా అధికారులకు సమాచారమిచ్చారు. సాగర్ అధికారులు వెంటనే యంత్రాల సాయంతో గండిని పూడ్చే పనులు ప్రారంభించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తెచ్చి తెల్లవార్లూ పనులు చేశారు. బుగ్గవాగులో వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో సాగర్ జలాశయం నుంచి నీటి విడుదల పరిమాణం తగ్గించారు. అర్ధరాత్రి సమయంలో గండి పూడ్చడానికి టిప్పర్లు, పెద్ద క్రేన్లు అవసరం కావడంతో స్థానిక శ్రీ చక్ర సిమెంట్స్ వారిని సంప్రదించగా, వారు వెంటనే స్పందించి రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు అందించారు. గండి పూడ్చేందుకు సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బంది సహకరించారు. సకాలంలో గండిని పూడ్చాలని మంత్రులు గొట్టిపాటి రవి, నిమ్మల రామానాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. సకాలంలో గండిని పూడ్చడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

అరటి ధర పతనమవకుండా చర్యలు

- పత్తి కోనుగోళ్లలో సిసిఐ తీరుపై ఆగ్రహం
- కేంద్రానికి లేఖ రాయాలని ఆదేశం
- సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అరటి ధర పతనం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలపై ఆయన సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అరటి రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన ఉత్పత్తులను జల రవాణా, రైలు రవాణాతోపాటు అవసరమైతే ఎయిర్ కార్గో ద్వారా రవాణా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల్లో 40 వేల హెక్టార్లలో అరటి సాగవుతుందని అధికారులు సిఎంకు వివరించారు. మహారాష్ట్ర ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా లాంటి రాష్ట్రాల్లో ఉత్పత్తి గణనీయంగా పెరగడం, వర్షాల కారణంగా ఎగుమతి రకాల పంటలు దెబ్బతినడంతో ధరలు పడిపోయాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై సిసిఐ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసిఐ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసినా రైతులు ఇబ్బందులు ఎదుర్కోవడంపై ఆరా తీశారు. ఎట్టి పరిస్థితిలోనూ పత్తి రైతులు నష్టపోవడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పార్కుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో అధిక ప్రయోజనం కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకూ, వచ్చే నెల 3న నిర్వహించనున్న 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో తాను పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం పరిధిలోని ప్రతి రైతు ఇంటికీ ముఖ్యమంత్రి లేఖను అందించడంతోపాటు నిర్దేశించిన పంచ సూత్రాలను వివరించాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్‌లో అత్యుత్తమ సాగు విధానాలను పాటించేలా రైతుల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. నీటి భద్రతలో భాగంగా భూగర్భజలాలు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలు వివరాలతో పాటు సమర్థ నీటి నిర్వహణ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ఫార్మర్ యాప్‌ను ప్రతీ రైతుకూ చేరువ చేయాలని సూచించారు. రియల్‌టైమ్ సమాచారం అందితేనే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి కె అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్యకారుల అభివృద్ధి, జీవనోపాధి పెంపు, వారి కుటుంబాల భద్రతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. సముద్రాలు, నదులు, చెరువుల వంటి ప్రకృతి సంపదపై ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్న లక్షలాది కుటుంబాల కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్య ఉత్పత్తిని అభివృద్ధి చేయడమే కాకుండా, ఈ రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, మత్స్యకారుల ఆదాయాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగం మరింత పురోభివృద్ధి సాధించేలా, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మత్స్యకారుల పట్ల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మాట నిలబెట్టుకుని, వేట నిషేధ కాలంలో భృతిని 'మత్స్యకార సేవలో' పథకంలో భాగంగా రూ.20 వేలకు పెంచామన్నారు. రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు ఈ మొత్తం రూ.259 కోట్లను నేరుగా వారి ఖాతాలకు జమ చేయనున్నట్లు తెలిపారు.



కృష్ణమ్మకు జలహారతి పడుతున్న నారా భువనేశ్వరి

కరువు రహిత రాష్ట్రమే సిఎం లక్ష్యం

- నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - శాంతిపురం :
ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. 3వ రోజు కుప్పం నియజకవర్గం పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడింపల్లి గ్రామంలో పర్యటించిన భువనేశ్వరి.. మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. మహిళలకు ఆర్థిక భద్రత అవసరమని, స్వయం ఉపాధి ద్వారా వారికి మరింత ఆదాయం లభిస్తుందని అన్నారు.

కృష్ణమ్మకు జలహారతి..

తుమ్మిసి పెద్దచెరువు వద్ద కష్ణమ్మకు సారె, పూలు, పసుపు కుంకుమలు సమర్పించి నారా భువనేశ్వరి జలహారతి ఇచ్చారు. అంతకుముందు శాంతిపురం నుంచి తుమ్మిసి వరకూ ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తూ మహిళలతో ముచ్చటించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గోనివారి శ్రీనివాసులు, రెస్కో చైర్మన్ ప్రతాప్, ఎంసి చైర్మన్ రాజు, మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కడా అడ్వైజర్ కమిటీ సభ్యులు సుగుణమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు చంద్రకళ పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ నిర్మాణ తీరును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పోలవరంలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - పోలవరం
పోలవరం ప్రాజెక్ట్‌ను శుక్రవారం కేంద్ర జలసంఘం ప్రతినిధులు పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర జల సంఘం డిజైన్లు, పరిశోధనా విభాగం ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఆదిత్య శర్మ, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ ఎస్ఎస్ భక్షితోపాటు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురామ్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్ట్‌లోని పనులను, స్పిల్‌వేను వారు పరిశీలించారు. జలవనరుల శాఖ ఇఎన్‌సి కె నరసింహమూర్తి, పోలవరం ఎస్ఇ కె రామచంద్రరావు, క్వాలిటీ కంట్రోల్ విభాగం సిఇ కె శేషుబాబు, డిఇలు కె బాలకృష్ణ, డి శ్రీనివాస్, ప్రేమ్‌చంద్, ఎంఇఐఎల్ జిఎం ఎ గంగాధర్, డిజిఎం మురళీ ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ నుంచి మొత్తం పనుల వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. స్పిల్‌వే గేట్లు, గేట్లను ఆపరేట్ చేసే సిలిండర్లు, పవర్ పాక్స్ మొదలైన వాటి పనితీరు గురించి వారు తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అప్‌స్ట్రీమ్ కాఫర్‌డ్యామ్, గ్యాప్1, డయాఫ్రమ్ వాల్, జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు.

రైల్వే సొత్తు చోరీ కేసులో ఆరుగురికి జైలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ
రైల్వే సొత్తును చోరీ చేసిన ఆరుగురు వ్యక్తులకు ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ రైల్వే కోర్టు, మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఆర్‌వి శర్మ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో ఒక రైల్వే జూనియర్ ఇంజనీర్ ఉద్యోగి కూడా ఉన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2022 డిసెంబర్ 9న రాజమండ్రి రైల్ కం రోడ్ బ్రిడ్జి వద్ద రైల్వేకు సంబంధించిన 20 పాత ఐరన్ ఛానల్స్‌ను తీసి కొత్త వాటిని వేశారు. అయితే, పాత ఐరన్ ఛానల్స్ చోరీ కావడంతో అప్పటి ఆర్‌పిఎఫ్ సిఐ సైదయ్య కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా కర్రీ మోహన్ బాబు, కె లక్ష్మణరావు, ఎన్ నాగేశ్వరరావు, కె మణిసాయి, సిహెచ్ కోటేశ్వరరావుతోపాటు రైల్వేలో జూనియర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం చిన్న మల్లయ్యలను దోషులుగా పేర్కొన్నారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి అరుగురిని దోషులుగా నిర్ధారించి శిక్ష విధించారు.

ఫారెక్స్ ట్రేడింగ్ వేదికలతో అప్రమత్తం

- ఆర్‌బిఐ హెచ్చరిక

ముంబయి : అనాధికారిక ఫారెక్స్ ట్రేడింగ్ వేదికల పట్ల అప్రమత్తంగా ఉండాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇన్వెస్టర్లను హెచ్చరించింది. ఇప్పటికే ఇలాంటి పలు సంస్థల జాబితాను విడుదల చేయగా.. తాజాగా మరో ఏడు ప్లాట్‌ఫామ్స్ పేర్లను నిషేధిత జాబితాలో వెల్లడించింది. దీంతో వీటి సంఖ్య 95కు చేరింది. కొత్తగా ప్రకటించిన వాటిలో స్టార్‌నెట్ ఎఫ్ఎక్స్, క్యాప్‌ప్లేస్, మిర్రరాక్స్, ఫ్యూజన్ మార్కెట్స్, ట్రైవ్, ఎన్ఎక్స్‌జి మార్కెట్స్, నార్డ్ ఎఫ్ఎక్స్‌లు ఉన్నాయి. విదేశీ మారక నిర్వహణ చట్టం-1999 (ఫెమా) ప్రకారం జాబితాలోని సంస్థలకు అధికారికంగా ఫారెక్స్ లావాదేవీలు చేపట్టేందుకు అనుమతి లేదు. ఇవి ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్(ఇటిపిలు)ను సైతం నిర్వహించేందుకు వీలు లేదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది.

లంక రైతులకు గుండెకోత

- గత పదేళ్లలో 1,300 ఎకరాలకు భూములు గోదావరి నదిలో కలిసిపోయిన వైనం
- గ్రోయిన్ల నిర్మాణానికి చొరవ చూపని సర్కారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి
గోదావరి నదీ కోత అన్నదాతలకు గుండె కోత మిగులుస్తోంది. ఏటా వరదల సమయంలో వందల ఎకరాల లంక భూములు నదిలో కలిసిపోతున్నాయి. ఈ భూములపైనే ఆధారపడి జీవించే వేలాది మంది లంక రైతు కుటుంబాలు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వశిష్ట, గౌతమి నదీ పాయల నడుమ ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో నదీ కోత ఎక్కువగా ఉంది. ఈ నియోజకవర్గంలోని ఆలమూరు, కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం మండలాల్లోని లంక భూముల్లో గత పదేళ్లలో 1,300 ఎకరాలకుపైగా గోదావరి నదిలో కలిసిపోయాయి. ఆత్రేయపురం మండలం పేరవరం పులిదిండి, రాజవరం, వసంతవాడ, ర్యాలి, బొబ్బర్లంక ప్రాంతాల్లో ఈ ఏడాది వరదలకు 50 ఎకరాల లంక భూములు ఈ పరిస్థితి పట్టింది. రావులపాలెం మండలం గోపాలపురం, కొమరాజులంక, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి గ్రామాల్లో లంక భూములు 25 ఎకరాలకుపైగా కోతకు గురయ్యాయి. ఆలమూరు మండలం మడికి, బడుగువాని లంక, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. ఈ ఏడాది అక్టోబర్‌లో వచ్చిన వరదలకు పి.గన్నవరం మండలంలో 20 ఎకరాల కొబ్బరి తోట నదీ కోతకు గురైంది. ఇదే మండలంలో లంకలగన్నవరం, కోడురులంక, పొట్టిలంక, కొండుకుదురులంక, పెదపట్నం లంక, బూరుగువానిలంక, ఊడిమూడి లంకలూ కోతకు గురయ్యాయి. గోదావరి ఎగువన ఉన్న సీతానగరం మండలం బొబ్బిల్లంక, జాలిమూడిలోనూ లంక భూములు నదిలో కలిసిపోయాయి.



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో కోతకు గురవుతున్న గట్టు

మట్టి, ఇసుక తవ్వకాలే కారణం

గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు, మట్టి తవ్వకాల వల్ల ప్రవాహం దిశను మార్చుకుంటుంది. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ ఎగువన, దిగువన ఇసుక తవ్వకాలను నిర్వహిస్తున్నారు. ఇష్టానుసారంగా డ్రెడ్జింగ్ పనులను నిర్వహిస్తున్నారు. మోతాదుకు మించి నదిలో ఇసుకను తవ్వడంతో ప్రవాహ వేగం పెరగడంతోపాటు గట్లు కోతకు గురవుతున్నాయని లంక రైతులు చెబుతున్నారు. దీనికి తోడు లంకల్లో మట్టిని కొంతమంది అక్రమార్కులు తవ్వేస్తూ ఇసుక బట్టీలకు తరలిస్తున్నారు. దీనివల్ల వరదల సమయంలో నీరు లంక పొలాల్లోకి ప్రవేశిస్తోంది. తవ్వకాలు జరిపిన ప్రదేశానికి సమీపంలోని భూములు కోతకు గురై సముద్రంలో కలిసిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

అరటి, కొబ్బరి పంటలను సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాం. గోదావరి నది వరద వచ్చిన ప్రతిసారీ భూములు కోతకు గురవుతున్నాయి. ఇప్పటివరకు నేను ఐదు ఎకరాల భూమిని కోల్పోయాను. నాతోపాటు ఈ ప్రాంతంలో ఇతర రైతులు 50 ఎకరాల వరకు కోల్పోయారు. పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. గ్రోయిన్లు ఏర్పాటు చేసి నదీ కోత నుంచి భూముల రక్షణ చర్యలు చేపట్టాలి.
- కల్లపూడి బ్రహ్మానందం, మెర్లపాలెం, ఆత్రేయపురం మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం

గోదావరి నదీ కోతపై వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించాం. రాజమండ్రి డివిజన్ పరిధిలో బొబ్బిలంక, జాలిమూడి, ములకల్లంక తదితర చోట్ల ఏటిగట్ల కోతలను గుర్తించాం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. తాజాగా ఎన్‌డిఆర్‌ఎఫ్‌కూ సమాచారం ఇచ్చాం. కోత నివారణ పనులకు సంబంధించి డిజైన్ అండ్ ఆర్గనైజర్స్ విభాగం వారు పరిశీలించనున్నారు. అనంతరం ఉన్నతాధికారులకు తెలియజేస్తారు. ఆపై అనుమతి మేరకు రక్షణ చర్యలు చేపడతాం.
- ఆనంద్ కుమార్, డిఇ, నీటిపారుదల శాఖ

ఉద్యోగోన్నతులపై 25న మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఉద్యోగోన్నతులు, ఫంక్షనీరీస్ అంశంపై ఈ నెల 25న ఉదయం 11 గంటలకు మంత్రివర్గ ఉపసంఘం భేటీ కానుంది. మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన జరగనున్న భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ అన్ని శాఖల హెచ్‌ఒడిలకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైతుల జీవితాలకు కొత్త దిశనిచ్చే 'మీకోసం'

- వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతుల జీవితాలకు కొత్త దిశనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా 'రైతన్నా మీకోసం' రూపొందించిందని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకూ వ్యవసాయం పట్ల స్పష్టమైన అవగాహన కల్పించడం, ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడం, తద్వారా రైతు రాజు కావాలనే సంకల్పంతో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం చేపట్టామని చెప్పారు. మాజీ సిఎం వైఎస్ జగన్ హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు వెళ్లే సమయంలో చేసిన బలప్రదర్శనపై న్యాయ వ్యవస్థ పున:పరిశీలన చేయాలని టిడిపి కార్యాలయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు కోరారు. అసెంబ్లీ సమావేశాలకు సరిగ్గా హాజరుకాని జగన్ కోర్టుకు వెళ్లేటప్పుడు ఇంత ఆర్భాటం ఎందుకని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసు, టిటిడి నెయ్యి కుంభకోణం, ఇడి, సిబిఐ కేసుల రూపంలో అన్ని కేసులూ చుట్టుముడుతుండటంతో జగన్ రాజకీయ జీవితం చరమాంక దశకు చేరుకుందని విమర్శించారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కార్గో ఎయిర్‌పోర్టు వద్దు

- నల్లబ్యాడ్జీలతో రాంపురం గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)
కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రద్దు చేయాలని కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు డిమాండ్ చేశారు. ఈ నెల 18న పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహా ధర్నాపై నిర్బంధాన్ని నిరసిస్తూ పోరాట కమిటీ పిలుపు మేరకు మందస మండలం రాంపురం గ్రామస్తులు నల్లబ్యాడ్జీలతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బాధిత రైతులు మాట్లాడుతూ పోరాట కమిటీ నాయకుడు బత్తిని లక్ష్మణ్‌పై కొందరు అన్యాయంగా బైండోవర్ కేసు పెట్టించి సోషల్ మీడియా వేదికగా దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత రైతులు చేస్తోన్న ప్రజా పోరాటంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాకే ఎయిర్‌పోర్టులు వద్దని, మా భూములే మాకు కావాలని తేల్చిచెప్పారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రభుత్వం ముందుకెళ్తే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్టి ధర్మారావు, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు, వైఎస్‌ఆర్ ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డు సభ్యులు బత్తిని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి వేడుకల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్
శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్వహిస్తున్న సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాలకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవిస్ హాజరయ్యారు. పుట్టపర్తికి వచ్చిన ఆయనకు టిడిపి కూటమి నాయకులు, అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మహారాష్ట్ర నుండి నేరుగా పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎ శ్యాంప్రసాద్, ఎస్‌పి ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ బిజెపి నాయకులు ఎస్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తి విమానాశ్రయం నుండి నేరుగా ఆయన ప్రశాంతి నిలయం. చేరుకున్నారు. సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు.



మహారాష్ట్ర ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

ఆటో రిక్షాలు పంపిణీ : ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది లబ్ధిదారులకు ఆటో రిక్షాలను పంపిణీ చేశారు. మహారాష్ట్ర సిఎం దేవేంద్ర, ఒడిశా గవర్నర్ హరిబాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితోపాటు ఇతర ప్రముఖులతో కలిసి లబ్ధిదారులకు ఆటో రిక్షాలను పంపిణీ చేశారు.



అంతిమయాత్రలో పాల్గొన్న ఉద్దానం ప్రజలు

స్వగ్రామంలో టెక్ శంకర్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు
ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ అంత్యక్రియలు అశ్రు నయనాల నడుమ శుక్రవారం జరిగాయి. జోగారావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు, అమరవీరుల బంధుమిత్రులు, సంఘం సభ్యులు స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని బాతుపురానికి శుక్రవారం ఉదయం తీసుకొచ్చారు. అంతిమయాత్రకు సిద్ధమవుతుండగా, కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతి కలుగజేసుకుని పార్టీ జెండాలతో ఊరేగిస్తే అడ్డుకుంటామనడంతో ప్రజాసంఘాల నాయకులు వాగ్వివాదానికి దిగారు. బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులు, చివరకు అంత్యక్రియలనూ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతిమయాత్రలో విప్లవ గీతాలు ఆలపిస్తూ 'జోగారావు ఆశయాలు సాధిద్దాం - జోగారావు అమర్ రహే' అని నినాదాలు చేశారు. జోగారావు సోదరుడు మధు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో మందస ఎంపిపి డొక్కరి దానయ్య, సర్పంచ్ లక్ష్మీనారాయణ, అమరుల బంధుమిత్రుల సంఘం బాధ్యులు అంజమ్మ, జోగి కోదండరావు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో ఇ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు ప్రారంభం

- మంత్రి నారాయణ
- రాజధాని గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)
ఇ - హెల్త్, వెల్ నెస్ కేంద్రాలను, స్కూళ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను డిసెంబర్ నెలాఖరులో ప్రారంభిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. రాజధానిలోని వెంకటపాలెం, ఉద్దండ రాయునిపాలెంలో శుక్రవారం నిర్మాణం జరిగిన ఇ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్దండ రాయునిపాలెంలో మంత్రి మాట్లాడారు. రాజధాని అమరావతిని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి సిటీ ఇన్వెస్ట్‌మెంట్ టూ ఇన్నోవేట్ ఇంటిగ్రేటెడ్ అండ్ సస్టైన్ ప్రాజెక్ట్ (సిఐటిఐఐఎస్) పథకం అమలు చేశామని, దీనిలో భాగంగా 15 అంగన్‌వాడీ భవనాలు, 14 ఇ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు,14 పాఠశాలలు, ఒక మల్టీ పర్పస్ స్మశాన వాటిక నిర్మాణం జరిగిందన్నారు. అంగన్‌వాడీ, ఇ - హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల ద్వారా రాజధాని గ్రామాల్లో నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామ కంఠాలు, జరీబు భూములు, లంక భూముల సమస్యలపై ప్రతిరోజు అధికారులతో చర్చిస్తున్నామన్నారు. లంక భూములకు సంబంధించి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) నుంచి అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. కొంతమంది రైతులు తమకు కోరుకున్న చోట ప్లాట్లు కావాలని అడుగుతున్నారని, అది సమంజసం కాదని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలన్నీ వంద శాతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రైతులతో ఎవరు అవహేళనగా మాట్లాడలేదని, రైతులకు ఏ సమస్య ఉన్నా రాజధానిలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని మంత్రి తెలిపారు. రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయన్నారు. రాజధానిలో మొత్తం 29,421 మంది రైతులకు చెందిన 61,433 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని, ఇంకా 2,270 మంది రైతులకు 7,988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని వివరించారు. కోర్టు కేసులు, కుటుంబ తగాదాలు కారణంగా ప్లాట్ల కేటాయింపు పెండింగ్‌లో ఉందన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేసి తీరుతామని తెలిపారు.



కాంక్రీట్ లిఫ్ట్ బకెట్ పడి ఉపాధ్యాయిని మృతి

ప్రజాశక్తి - పాయకరావుపేట (అనకాపల్లి)
కాంక్రీట్ లిఫ్ట్ బకెట్ పడి ఉపాధ్యాయిని మృతి చెందిన ఘటన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయతీ రాజానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ సిఎస్‌ఆర్ నిధులతో రాజానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్లాబ్ నిర్మాణ పనుల కోసం సామగ్రిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో స్లాబ్ సామగ్రిని మోసుకెళ్లే కాంక్రీట్ లిఫ్ట్ బకెట్ ఊడిపడి అక్కడే ఉన్న ఆంగ్ల ఉపాధ్యాయిని జ్యోష్నాబాయి (47)పై పడింది. దీంతో ఆమె తీవ్ర గాయాలపాలైయ్యారు. తుని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. కాంట్రాక్టర్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జ్యోష్నాభాయి (ఫైల్)

హోం మంత్రి అనిత దిగ్భ్రాంతి

ఉపాధ్యాయిని జ్యోష్నా బాయి మరణించారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనిత తెలిపారు. ఆమె కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంతామని హామీ ఇచ్చారు.

పారిశ్రామికవేత్తలుగా ఎస్‌హెచ్‌సి సభ్యులు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని, వారికి బ్యాంకు రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ పేదరిక నిర్మూలన (సెర్ప్) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. విజయవాడలోని సెర్ప్ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 39,371 మంది ఎస్‌హెచ్‌జి సభ్యులకు 578.08 కోట్లతో వ్యాపార, సేవా, పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేశామన్నారు. 2026 మార్చి నాటికి రూ.32,322 కోట్ల రుణాలను ఎస్‌హెచ్‌జి సభ్యులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకూ రూ.16,846 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. లక్ష్యాలను సాధించడానికి అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సెర్ప్ ఆధ్వర్యాన 520 ఎఫ్‌పిఒ (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు) ఏర్పాటు చేయగా, హైఫర్ ఇంటర్నేషనల్, వాసన్ కాల్గుడి, బ్రెండ్స్ సంస్థల సహకారం రైతు ఉత్పత్తి సంస్థల బలోపేతం చేసి, రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించి, రైతులు పండించిన పంటలను ఎఫ్‌పిఒల ద్వారా సేకరించి, ప్రాసెస్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది సామాజిక పెట్టుబడి నిధి రూ.175 కోట్ల రుణాలు జీవనోపాధుల మెరుగుకు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధికి సంబంధించిన వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా చేపట్టినందుకు అధికారులను అభినందించారు. స్వయం సహాయక సంఘ మహిళలను వ్యవస్థాపకులుగా తయారు చేయడానికి విశాఖపట్నం ఐఐఎంను ఇంక్యుబేషన్ సెంటర్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో 150 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శాఖాపరంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ, డిప్యూటీ సిఇఒ శ్రీరాములు నాయుడు, స్త్రీనిధి ఎమ్‌డి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టన్ను అరటికి రూ.25 వేలు

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
టన్ను అరటి పంటకు కనీసం రూ.25 వేలు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ధరల పతనంపై వెంటనే సమీక్షించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గల్ఫ్, యూరప్ దేశాలకు ఎగుమతులు ఎందుకు నిలిచిపోయాయనే విషయాన్ని పరిశీలించి, తక్షణమే ఎగుమతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నదాతను అరటి పంట ముంచుతుంటే, వారి ఆక్రందన కూటమి ప్రభుత్వానికి పట్టకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. టన్ను ధర రూ.28 వేల నుంచి రూ.వెయ్యికి పడిపోవడం పరిస్థితికి అద్దం పడుతుందని తెలిపారు. ఆరుగాలం కష్టించి పండించిన అరటి గెలలను పశువులకు మేతగా పడేస్తుంటే రాష్ట్రంలో రైతు సంక్షేమం ఎక్కడుందని ప్రశ్నించారు.




విచారకరం!

శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య సమతుల్యతను నిర్ధారించడంలో అర్థవంతమైన పాత్ర పోషించవలసిన న్యాయస్థానాలు అందుకు వెనుకాడరాదు. కానీ ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం నాడిచ్చిన తీర్పు రాజ్యాంగ సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే బదులు, సమస్యను మరింత క్లిష్టతరం చేయడం విచారకరం. ఒకవైపు బిల్లులకు అనుమతి ఇవ్వడానికి సమయాన్ని నిర్ణయించలేమని పేర్కొంటూనే మరోవైపు "గవర్నర్‌ను నిర్ణీత సమయ పరిమితిలో నిర్ణయం తీసుకోమని ఆదేశించడానికి న్యాయస్థానం పరిమిత న్యాయ సమీక్ష అధికారాన్ని ఉపయోగించగలదు" అని తెలిపింది. మరి సమయ పరిమితి అంటే ఏమిటో ఎవరు నిర్ణయిస్తారు? రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజన (సెపరేషన్ ఆఫ్ పవర్స్) అంశాన్ని నిర్దిష్టపర్చవలసిన సర్వోన్నత న్యాయస్థానం తన రాజ్యాంగ విహిత బాధ్యతను తప్పించుకోవడంగా భావించవలసి వుంటుంది.

రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా సమర్థిస్తూ, శాసనసభలు ఆమోదించే బిల్లులపై గవర్నర్లు నిర్దిష్ట కాలపరిమితిలోపు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశిస్తూ 2025 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలో పేర్కొన్న విషయాలు మరియు పదాలను స్పష్టమైన భాషలో నిర్వచించడం ద్వారా ఆ తీర్పు ప్రజాస్వామ్య పాలన పట్ల ఆశ కలిగించడంతోపాటు సమాఖ్యవాదాన్ని బలోపేతం చేసింది. దాంతో గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు ముగింపు పలకవలసిన పరిస్థితి ఏర్పడింది. శాసనసభ ఆమోదించిన బిల్లుపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని, బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్లకు లేదని స్పష్టం చేసిన ధర్మాసనం రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుండి ఉన్న అస్పష్టతను పరిష్కరించింది. అప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం మరియు బిజెపి ఈ చారిత్రాత్మక తీర్పును తీవ్రంగా విమర్శించాయి. తీర్పులోని కొన్ని చట్టపరమైన అంశాలపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి మరియు గవర్నర్లు కాలపరిమితిని నిర్ణయించలేరని మరియు న్యాయపరమైన ఉత్తర్వు ద్వారా కాలపరిమితిని నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇప్పుడు తీర్పు చెప్పింది. రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయం ఆందోళన కలిగించే విషయం. ఇంతకుముందే నిర్ణయించబడిన అంశంలో తాజాగా అస్పష్టతను సృష్టించింది. ఈ తీర్పు కేంద్ర ప్రభుత్వం గవర్నర్లను ఉపయోగించి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో రాజ్యాంగ సంక్షోభం సృష్టించడానికి మరోసారి అవకాశాన్నిస్తోంది. సమాఖ్యవాదం మరియు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఈ తీర్పు సహాయపడదు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై అనవసరమైన జాప్యం మరియు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎటువంటి పరిష్కారాన్ని ప్రతిపాదించలేదు. ప్రస్తుత పరిస్థితిలో ఇది అనిశ్చితి మరియు ఆందోళనను సృష్టిస్తుంది.

గవర్నర్ ఎన్నికైన ప్రభుత్వ సలహా మేరకు వ్యవహరించాలని, మరో అధికార కేంద్రంగా మారకూడదని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో పదే పదే ఎత్తి చూపింది. గురువారం కూడా ఈ అంశాలను నొక్కి చెప్పింది. బిల్లులపై నిర్ణయాలు తీసుకోవడంలో రాష్ట్రపతి, గవర్నర్ విచక్షణాధికారాలు కలిగి ఉంటారు. అయితే, స్పష్టమైన కారణాలు లేకుండా గవర్నర్లు ఆమోదం తెలపకుండా బిల్లులను నిలిపివేయడం సరికాదు. ఇది సమాఖ్యవాదం మరియు ప్రజాస్వామ్య ప్రయోజనాలకు విరుద్ధమని కోర్టు పదే పదే చెప్పింది. ఆమోదం పొందని బిల్లులను గవర్నర్ అభిప్రాయంతో అసెంబ్లీకి తిరిగి పంపాలి. వాటిని నిరవధికంగా నిలిపివేయరాదు. గవర్నర్ల చర్యలు కొంతవరకు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని పేర్కొన్నా.. ఈ తీర్పులో నిర్ణయాత్మకంగా స్పష్టీకరించలేదు. వాస్తవానికి, తమిళనాడు కేసులో తీర్పును, సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన తీర్పులను తిరస్కరించే విధంగా ఈ తీర్పులో అభిప్రాయం వ్యక్తమైంది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న రాజ్యాంగ సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే బదులు, కోర్టు సమస్యను మరింత క్లిష్టతరం చేయడం విచారకరం.



మన లక్ష్యం కేవలం ప్రైవేట్ ఆస్తిలో
మార్పులు తీసుకురావడం కాదు.
దానిని రద్దు చేయడం.
వర్గ వైరుధ్యాలను కప్పిపుచ్చడం కాదు,
వర్గాలను రద్దు చేయడం.
ప్రస్తుత సమాజానికి
మెరుగులు దిద్దడం కాదు.
కొత్త సమాజాన్ని నిర్మించడం.

- కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్

బీహార్ ఫలితాల సంకేతం, భవిష్యత్తు

బీహార్ శాసనసభ ఎన్నికలు మన దేశ ఎన్నికల చరిత్రలో చెరగని గుర్తులుగా వుంటాయి. జూన్ 25న ప్రకటించిన ప్రత్యేక సమగ్ర పరిశీలన నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికలు వయోజన ఓటింగుకు సరికొత్త కొలబద్దలను నిర్ణయించాయి.

రాజ్యాంగాన్ని రూపొందించిన నాటి రాజ్యాంగ పరిషత్తులో జరిగిన చర్చలు ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల యొక్క ప్రజాస్వామ్యం వుండాలని ఆకాంక్షించాయి. దానికి పునాది ఎన్నికల ప్రజాస్వామ్యమే. పౌరుల పాత్రనే కీలక పునాదిగా నొక్కి చెప్పిన స్వాతంత్ర్య పోరాట వారసత్వ భావనతో ఈ విధమైన నిర్ణయం జరిగింది. కులం, మతం, భాష, సంస్కృతి, మూలం వంటి తేడాలతో నిమిత్తం లేకుండా భారత పౌరులందరికీ ఒక్కో ఓటు వుండాలి. ఈ ఏర్పాటును గట్టిగా కొనసాగించడం కోసం ఎన్నికల కమిషన్‌కు నిజమైన శక్తిగల సంస్థగా స్వతంత్ర రాజ్యాంగ విభాగంగా సాధికారత కల్పించబడింది.

భారత ప్రజాస్వామ్య భవిష్యత్తునూ, దాని రాజకీయ వ్యవస్థనూ నిర్ణయించే అవకాశం పౌరులకు కల్పించాలని భావించబడింది. ఇందుకు చాలా సులభతరమైన రెండు సూత్రాలు రూపొందించారు. మొదటిది-రాజకీయ పార్టీల, ప్రభుత్వాల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఎన్నికల కమిషనే (ఇసిఐ) ఓటర్ల జాబితాలను తయారు చేయాలి. అందువల్ల ఇసిఐ యంత్రాంగమే తుది ఓటరు జాబితాలను ప్రచురించాలిగానీ వ్యక్తిగతంగా పౌరులపై ఆ భారం మోపలేదు. రెండవది-భారత పౌరులు ఓటరు జాబితాలో ఓటర్లుగా కనిపించే మాట నిజమే అయినప్పటికీ పౌరసత్వ నిర్ణయ బాధ్యత ఎన్నికల సంఘానికి అప్పగించలేదు. ఒకవేళ ఏదైనా తేడా వస్తే హోంశాఖతో సంప్రదించి పరిష్కరించుకోవలసి వుంటుంది.

పునాది సూత్రాల ఉల్లంఘన

అయితే మొదటిసారిగా బీహార్‌లో 'సర్' ఈ రెండు సూత్రాల పునాదిని ఉల్లంఘించింది. ఎలాంటి వివాదం లేకున్నా సరే ఓటర్లు ఒక దరఖాస్తు భర్తీ చేయడం ద్వారా తమ ప్రవేశానికి హామీ పొందాలనేది 'సర్' భావనగా సాగింది. ఓటుకు అర్హతగా ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలను వారు సమర్పించాల్సి వచ్చింది. ఇది రెండో సూత్రంతో ముడిపడింది కూడా. ఇసిఐ నిర్దేశించిన అధికార పత్రాలు అచ్చంగా పౌరసత్వ సవరణ చట్టం కింద జాతీయ పౌరసత్వ రిజిస్టరు అవసరాలకు సరిపోయేవిగా వున్నాయి.

ఈ విధంగా అంతకు ముందు పౌరసత్వంపై ఏ వివాదమైతే విస్ఫోటనం చెందిందో, అంతు తేలని ప్రశ్నల వల్ల ప్రతిష్టంభనలో పడిపోయిందో దాన్నే దొడ్డిదోవన తీసుకు వచ్చినట్టయింది. ఇది బీహార్‌లో తీవ్ర నిరసనలకు దారితీసింది. దేశమంతటా చర్చ చెలరేగింది. ప్రధాన సమస్య ఏమంటే పౌరసత్వం కోసం ఏ ఒక్క పత్రమూ అధికారికంగా గుర్తించబడలేదు. ఈ ప్రతిపాదిత 'సర్' మాత్రం విభజన నాటి విషాదాన్ని లోలోపల తిరిగి తీసుకొచ్చినట్టయింది. లోతుగా ప్రశ్నించినప్పుడు పౌరసత్వానికి ఓటరు జాబితా ఖరారు చేయడానికి మధ్యలో ఏ సంబంధం లేదని ఇసిఐ ఖండిస్తుంది. అయితే వాస్తవంలో ఈ విధమైన కేంద్రీకరణ తేటతెల్లమవుతూనే వుంది.

అందువల్ల ఈ కసరత్తు కొంత కాలం సాగిన తర్వాత ఇది ఓటరు జాబితాలో తప్పులను సరిదిద్దేందుకు ఉద్దేశించినది కాదనీ, సామూహిక తొలగింపులకూ ఓటు హక్కు తొలగించడానికి ఉద్దేశించిందని తెలిపోయింది. ఓటరు జాబితాల ముసాయిదాలు, వాటి తుది రూపం ప్రచురించాక వివాదం ఇంకా ముదిరింది. ఓటర్ల జాబితా తగ్గిపోవడం కళ్ల ముందు కనిపించింది. 'సర్' ప్రక్రియ రాజ్యాంగ ఆంతర్యాలు ఇంకా సుప్రీం కోర్టు నిర్ధారణగా చెప్పవలసే వుంది. ఈ ప్రక్రియ మొత్తం గణనీయమైన సంఖ్యలో ఓటర్లను తీవ్ర ఒత్తిడికి గురిచేసిందనేది సుస్పష్టం. వలస కార్మికుల నిష్పత్తి చాలా ఎక్కువగా వుండటం, అందుబాటులో వున్న సమయం అత్యంత తక్కువ కావడంతో ఇది తథ్యంగా జరిగింది. ఓటరు జాబితాలలో మహిళా ఓటర్ల పేర్లు భారీగా తొలగించబడ్డాయి. సరిహద్దు జిల్లాల్లో మైనార్టీలు నివసించే ప్రాంతాలలోనూ ఈ తొలగింపు అధికంగా జరిగింది.

ఎన్ని చెప్పినా ఏం చేసినా 'ఇండియా' వేదిక పార్టీలు అంతరావలోకనం చేసుకోవలసింది కూడా చాలా వుంది. ప్రజల జీవితాలనూ జీవనోపాధినీ దెబ్బ తీసే సమస్యలు చాలా వున్నప్పటికీ ప్రతిపక్షం వాటిపై ప్రజాభిప్రాయాన్ని ప్రజ్వలింపచేయడంలో విఫలమైంది. పాలక కూటమిని వెనక్కు కొట్టలేకపోయింది. మరింత లోతుగా మథించవలసిన, కలసి మెలసి పరిశీలించవలసిన అంశాలు అనేకం వున్నాయి. ప్రభుత్వ కుమ్మక్కుతో, మొత్తం నయా ఫాసిస్టు పోకడలతో హిందూత్వ కార్పొరేట్ ఆక్రమణకు వ్యతిరేకంగా నిరంతర రాజకీయ ఉద్యమం సాగించవలసి ఉంటుంది. సక్రమమైన ఎన్నికల వ్యవస్థ కోసం, న్యాయమైన ప్రజాస్వామ్యం కోసం పోరాడాలంటే అలాంటి నిరంతర సమరం చేయవలసే వుంటుంది.



మొత్తం మహిళా ఓటర్ల సంఖ్యనేమో తగ్గింది. అయితే వారు సాపేక్షంగా భారీ సంఖ్యలో ఓట్లు వేశారు. ఫలితంపైన నిర్ణయాత్మక ప్రభావం చూపించారు. ఈ లక్షణం ఇదివరలో కూడా వుండింది. కానీ ఇప్పుడు 'సర్' దెబ్బ తోడవడం, సాపేక్షంగా వలస పురుష కార్మికుల ఓటర్ల సంఖ్య భారీగా తగ్గడంతో దాని ప్రభావం మరింత ప్రస్ఫుటంగా కనిపించింది. వాస్తవాభివృద్ధి సమస్యలతో సంబంధం లేకుండా పోయిన ఈ పరిస్థితి మరింత బాగా విదితమవుతూ వచ్చింది. ఎందుకంటే వేతనాలు, ఆదాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం తదితర సామాజిక సూచికల్లో భారత దేశంలోని అత్యధిక రాష్ట్రాల కంటే బీహార్ వెనకబడి వుంది. కానీ దేశంలోని కార్పొరేట్ మీడియా మాత్రం నితీష్ కుమార్ ప్రభుత్వం గొప్ప కృషి వల్లనే పాలక కూటమి ఈ కీలక విజయం సాధించిందని చిత్రిస్తున్నది .

ముందస్తుగా తాయిలాలు

అలాగే ఇసిఐ పాత్రేమిటన్న స్పష్టమైన ప్రశ్న కూడా కీలకంగా ఆందోళనకు కారణమైంది. ఇసిఐ వ్యవహరిస్తున్న తీరు అస్తవ్యస్తంగా పారదర్శకత రతహింగా వుండటమే గాక పాలక పార్టీకి మేలు చేసే దిశలో పక్షపాత వైఖరి చాలా స్పష్టంగా గోచరించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ని ఇసిఐ అమలు చేసే విషయంలోనూ ఈ ధోరణి కానవచ్చింది. ఎన్నికల ప్రకటనకు కాస్త ముందుగా బీహార్‌లోని బిజెపి, జెడియు ప్రభుత్వం కోటి మంది మహిళలకు తలకు పది వేల రూపాయలు జమచేస్తూ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన తీసుకొచ్చింది. ఈ భారీ లబ్ధి పథకం కింద ఎన్నికలు బాగా దగ్గరకొచ్చిన తరుణంలో 14 వేల కోట్ల రూపాయలు వెనువెంటనే బట్వాడా అయ్యాయి. 'ప్రభుత్వ సొమ్ముతో దాతృత్వం' వంటి ఈ చర్య ఓటర్లను ప్రభావితం చేయకుండా వుండలేకపోయింది. ఆయా పార్టీలు, వ్యక్తులు రాజకీయ ఎంపికలను శాసించే పద్ధతిలో పేదలు గ్రహీతలుగా వుండిన గత పరిస్థితికి భిన్నం ఇది.

ఇదేగాక పాలక కూటమి 125 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు, సామాజిక భద్రతా పింఛన్లు మూడింతలు చేయడం, కోటి ఉద్యోగాల కల్పన వాగ్దానాలు కూడా చేయకపోలేదు. తాయిలం రాజకీయాల గురించీ, ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం గురించీ ప్రధానమంత్రి మోడీ చెప్పే మాటలకూ ఇలాంటి వాగ్దానాలకూ పొసగదన్న మాట సరే. అలాంటి వాగ్దానాల ప్రకటనకూ వాస్తవంగా ఎన్నికల నిర్వహణకూ మధ్య తగినంత వ్యవధి వుండేలా ఎంసిసిని తిరగరాయాలన్న చర్చ ఇప్పటికే నడుస్తున్నది. అలాంటి చర్యలు ప్రజల దీర్ఘకాలిక శ్రేయస్సుకు సంబంధించిన అంశాల నుంచి దృష్టి మళ్లించాయనేది సుస్పష్టం. ప్రజల ఆలోచనల్లో మార్పు తేవడానికీ, మరీ ముఖ్యంగా అత్యంత దుర్భర పరిస్థితుల్లో వున్నవారిని తిప్పుకోవడానికీ ఉద్దేశించిన చర్యలివి.

విద్దూరం విదితం

ఎన్నికల ఫలితాలు నిజంగానే ఆ విద్దూరాన్ని ప్రతిబింబించాయి. మొత్తం మహిళా ఓటర్ల సంఖ్యనేమో తగ్గింది. అయితే వారు సాపేక్షంగా భారీ సంఖ్యలో ఓట్లు వేశారు. ఫలితంపైన నిర్ణయాత్మక ప్రభావం చూపించారు. ఈ లక్షణం ఇదివరలో కూడా వుండింది. కానీ ఇప్పుడు 'సర్' దెబ్బ తోడవడం, సాపేక్షంగా వలస పురుష కార్మికుల ఓటర్ల సంఖ్య భారీగా తగ్గడంతో దాని ప్రభావం మరింత ప్రస్ఫుటంగా కనిపించింది. వాస్తవాభివృద్ధి సమస్యలతో సంబంధం లేకుండా పోయిన ఈ పరిస్థితి మరింత బాగా విదితమవుతూ వచ్చింది. ఎందుకంటే వేతనాలు, ఆదాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం తదితర సామాజిక సూచికల్లో భారత దేశంలోని అత్యధిక రాష్ట్రాల కంటే బీహార్ వెనకబడి వుంది. కానీ దేశంలోని కార్పొరేట్ మీడియా మాత్రం నితీష్ కుమార్ ప్రభుత్వం గొప్ప కృషి వల్లనే పాలక కూటమి ఈ కీలక విజయం సాధించిందని చిత్రిస్తున్నది.

'సర్' అనేది నిరుపేదలూ దుర్భర జీవితాలు గడుపుతున్న విస్తార వర్గాల ప్రజలలో ఒక విధమైన భయాందోళన కలిగించింది. పాలక కూటమి కుల, మత ప్రభావం దాన్ని మరింత తీవ్రం చేసిందనేది కూడా వాస్తవం. అమిత్ షా కనిపెట్టారని చెబుతున్న ఓట్ మేనేజ్‌మెంట్ వ్యవహారం చిన్న పార్టీలనూ స్వతంత్ర అభ్యర్థులనూ మటుమాయం చేసింది. వారు తెచ్చుకునే ఓట్లు పూర్తిగా పాలక కూటమి వైపు మరలేలా చేసింది. కొన్ని చిన్న పార్టీలకు సీట్లపరంగా పెద్ద ప్రభావం చూపలేకపోయినా వారి ఓట్ల శాతం ప్రతిపక్షానికే నష్టం కలిగించాయి. భారీ ప్రచారం పొందిన ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్ పార్టీ', సీమాంచల్‌లో మజ్లిస్ పార్టీ పాత్ర ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది.

నిరంతర సమరం

ఇవన్నీ ఎన్ని చెప్పినా ఏం చేసినా 'ఇండియా' వేదిక పార్టీలు అంతరావలోకనం చేసుకోవలసింది కూడా చాలా వుంది. ప్రజల జీవితాలనూ జీవనోపాధినీ దెబ్బ తీసే సమస్యలు చాలా వున్నప్పటికీ ప్రతిపక్షం వాటిపై ప్రజాభిప్రాయాన్ని ప్రజ్వలింపచేయడంలో విఫలమైంది. పాలక కూటమిని వెనక్కు కొట్టలేకపోయింది. మరింత లోతుగా మథించవలసిన, కలసి మెలసి పరిశీలించవలసిన అంశాలు అనేకం వున్నాయి. సిపిఎం తో సహా వామపక్షాలు నిర్విరామంగా పనిచేశాయి. గణనీయంగా ఓట్లు కూడా తెచ్చుకున్నాయి. కానీ ఆ ఓట్లు శాసనసభ ప్రాతినిధ్యంగా అనువదించుకోవడంలో సఫలత లేదు. సమస్యలపై ప్రజా పోరాటాలను పునరుధృతం చేయడంలోనే భవిష్యత్తు ఇమిడి వుంది. ప్రభుత్వ కుమ్మక్కుతో, మొత్తం నయా ఫాసిస్టు పోకడలతో హిందూత్వ కార్పొరేట్ ఆక్రమణకు వ్యతిరేకంగా నిరంతర రాజకీయ ఉద్యమం సాగించవలసి ఉంటుంది. సక్రమమైన ఎన్నికల వ్యవస్థ కోసం, న్యాయమైన ప్రజాస్వామ్యం కోసం పోరాడాలంటే అలాంటి నిరంతర సమరం చేయవలసే వుంటుంది.

(నవంబరు 19 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కాశ్మీరీలపై నమ్మకం పోగొడతారా?

పీపీ

ఇటీవల ఎర్రకోట దగ్గర పేలుడు తర్వాత మరోసారి కాశ్మీర్ చర్చ పెరిగింది. ఉగ్రవాదులతో సంబంధం గలవారు కాశ్మీర్‌లో పట్టుపడటం ఇందుకు కారణంగా చూపుతున్నారుగానీ ఈ ధోరణి ముందు నుంచి వున్నదే. దీనివల్ల ఒక విధంగా కాశ్మీరీలపైనే నమ్మకం సన్నగిల్లే పరిస్థితి వచ్చిందని సాక్షాత్తూ దాని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లానే ఆవేదన చెందుతున్నారు. ఎవరో కొద్దిమంది చేసిన పనులకు మా ప్రజలందరినీ అనుమానిస్తారా? కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్ యంత్రాంగం కలసి చేసే నిర్వాకాల వల్ల మా హోదాతో పాటు గౌరవం కూడా పోయింది. ఇప్పుడు కాశ్మీర్‌కు చెందిన డ్రైవర్లు కూడా ఢిల్లీ కింద రిజిస్టర్ చేసుకుంటున్నారు. నేను కూడా మా నెంబర్‌తో ప్రయాణించాలంటే సందేహించాల్సి వస్తున్నది అని ఆయన వాపోయారు. మాకు మళ్లీ పూర్తి హోదా వస్తుందని చెప్పారు...ఎప్పుడు అని ప్రశ్నించారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా...ఆసేతు శీతాచలం.. ఇవే భారతదేశం గురించి అభివర్ణించడానికి అలవాటుగా వాడే పదాలు. ఇందులో ఏది లేకున్నా ఈ మహత్తర భారత ముఖచిత్రం అసంపూర్ణమవుతుంది. మూడు దఫాలుగా ఈ దేశాన్ని పాలిస్తున్న మోడీ సర్కారుకు మాత్రం ఈ రెండు ప్రాంతాలూ పంటి కింద రాయిలాగా తగులుతుంటాయి. ఏమంటే ఈ రెండు చోట్ల వారెప్పుడూ అధికారంలోకి రారు. పైగా కాశ్మీర్‌లో వేర్పాటువాదం చెలరేగిపోతున్నట్టు ప్రచారం చేసి మిగిలిన చోట్ల ఓట్లు పొందడానికి పాచికలు వేస్తారు. అక్కడ సాయుధ చర్యలు సంచలనమవుతాయి. అసలు కాశ్మీర్ స్వయం ప్రతిపత్తికి రాజ్యాంగం హామీ ఇచ్చిన 370వ అధికరణానికే ఎసరుపెట్టారు. రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా చేసి కేంద్ర పాలితం చేశారు. అందుకే అక్కడి ప్రజలు వారిని ఓడించి నేషనల్ కాన్ఫరెన్స్‌ను గెలిపించారు. ఆర్టికల్ 370 రద్దు వల్ల తామేదో అద్భుత ఫలితాలు సాధించినట్టు ఊదరగొట్టినా తర్వాత పరిణామాలు ప్రతికూలంగానే వున్నాయని పహల్గాం దాడితో తేలిపోయింది. ఇటీవల ఎర్రకోట దగ్గర పేలుడు తర్వాత మరోసారి కాశ్మీర్ చర్చ పెరిగింది. ఉగ్రవాదులతో సంబంధం గలవారు కాశ్మీర్‌లో పట్టుపడటం ఇందుకు కారణంగా చూపుతున్నారుగానీ ఈ ధోరణి ముందు నుంచి వున్నదే. దీనివల్ల ఒక విధంగా కాశ్మీరీలపైనే నమ్మకం సన్నగిల్లే పరిస్థితి వచ్చిందని సాక్షాత్తూ దాని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లానే ఆవేదన చెందుతున్నారు. ఎవరో కొద్దిమంది చేసిన పనులకు మా ప్రజలందరినీ అనుమానిస్తారా? కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్ యంత్రాంగం కలసి చేసే నిర్వాకాల వల్ల మా హోదాతో పాటు గౌరవం కూడా పోయింది. ఇప్పుడు కాశ్మీర్‌కు చెందిన డ్రైవర్లు కూడా ఢిల్లీ కింద రిజిస్టర్ చేసుకుంటున్నారు. నేను కూడా మా నెంబర్‌తో ప్రయాణించాలంటే సందేహించాల్సి వస్తున్నది అని ఆయన వాపోయారు. మాకు మళ్లీ పూర్తి హోదా వస్తుందని చెప్పారు...ఎప్పుడు అని ప్రశ్నించారు.

పవన్ జన్మ సిద్ధాంతం? ఐశ్వర్య బెటర్?

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వాక్కుల ప్రత్యేకత గురించి చెప్పనవసరం లేదు. సినిమాల్లో సన్నివేశాలనుబట్టి మారినట్టే ఆయన మాటలు కూడా వ్యూహాత్మకంగా మారుతుంటాయి. ఇప్పుడాయన చేగువేరా మాటలను వదలి సనాతన సినీ యోగ మార్గం పట్టారు. తన హోదాతో ఎన్‌డిఎ కు అనధికార రాయబారిగా రాజకీయ సేవ చేస్తున్నారు. తిరుమల శేషాచలం అడవుల్లోనే ఎర్రచందనం మరింత గట్టిగా వుండటానికి వెంకటేశ్వరస్వామి రక్తంతో తడవడమే కారణమని గతంలో ఎవరూ చెప్పని వనపురాణం తీసుకొచ్చారు. ఇప్పుడు పుట్టపర్తిలో ఆయన సత్యసాయిబాబా జన్మ సిద్ధాంతం కనిపెట్టారు. సాయిబాబా శతజయంతిని అధికారికంగా నిర్వహించడంపై చాలా విమర్శలు వచ్చాయి. మిగిలినవన్నీ వదలిపెట్టి ఆయన మంచినీటికి నిధులు ఇచ్చారనేది ఇప్పుడు ప్రధానమై కూర్చుంది. అయినా అభ్యంతరాలు కోర్టు కొట్టివేసింది గనక జరుపుతున్నారనుకుందాం. ఏకంగా ప్రధాని పాల్గొన్నారు. వారు వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎలాగూ వెళతారు కదా.. వెళ్లారు. మోడీ తనదైన శైలిలో సాయిబాబాను పొగిడేశారు. చంద్రబాబు సాయిబాబా దైవస్వరూపమని కీర్తించారు. ఈ దైవం బాగా వెనకబడిన ప్రాంతమైన పుట్టపర్తిలోనే పుట్టాలని ఎందుకు నిర్ణయించుకున్నారో పవన్ కల్యాణ్ విశదీకరించడం కొసమెరుపైంది. అంటే సాయిబాబా ముందే అనుకుని ఇక్కడ పుట్టారన్నమాట. నిజానికి వీరందరికంటే ఐశ్వర్యా రాయ్ మాటలే మెరుగ్గా వున్నాయి. కులమతాలకు అతీతంగా ప్రేమతో జీవించాలని ఆమె చెప్పారు. దేవుడొక్కడే నన్నారు. విశేషమేమంటే ఆరెస్సెస్‌కు ఒక దశలో సాయిబాబా అంటే పడేది కాదు! ఇప్పటికి షిర్డీ సాయిబాబాను పూజించవద్దంటారు. ఎందుకంటే...మతం, దేవుడు వారి వ్యూహాలకు అనుగుణంగా వుంటేనే.

బాహుబలికీ బెబ్బే...

నీకు బె...నీ అబ్బకు బెబ్బే అని కథ. కోర్టులో జడ్జి ఏమడిగినా బెబ్బే అనాలని ట్రైనింగ్ ఇచ్చిన లాయర్‌కు కేసు గెలిచాక ఫీజడిగితే బెబ్బే అన్నాడట క్లయింట్. దర్శక ధీరుడు రాజమౌళి సంగతి అలాగే అయింది. అల్లూరి సీతారామరాజును కూడా రాముడిలా చిత్రించిన ఆయన అదే రామాంజనేయ యుద్ధంలో చిక్కుకుపోవలసి వచ్చింది. మహేష్‌బాబుతో రాబోయే చిత్రానికి 'వారణాసి' అని పేరు పెట్టి భారీ ప్రమోషన్ చేయాలని తలపెట్టారు. అయితే ఈవెంట్‌లో సాంకేతిక చిక్కులు వచ్చేసరికి హనుమంతుడు సహకరించడంలేదని విసుక్కున్నారు. రాజమౌళి తండ్రి, రచయిత అయిన విజయేంద్ర ప్రసాద్‌ను బిజెపి రాజ్యసభకు పంపింది. ఆయనతో పాటు భార్య రమ కూడా ఆంజనేయ భక్తులట. దేవుడిపై పెద్దగా నమ్మకం లేదనే రాజమౌళి...వారు చెప్పినట్టుగ హనుమంతులవారు తనకు సహాయం రాలేదని చమత్కరించారు. దాంతో సంఘపరివార్ వీరభక్తులు ఆయనపై ట్రోలింగ్‌లు గుప్పించడమే గాక కేసు కూడా పెట్టించేశారు. అంతవరకూ ఏదో అనుకుంటే కేంద్రమంత్రి బండి సంజయ్ సహా రంగంలోకి దిగిపోయారు. రాజమౌళి దేవుడిని నమ్మేలా చేయాలని ఆ దేవునికే రెకమెండ్ చేస్తున్నాడీ సంజయుడు. ఇక బిజెపి లాంఛనంగా బహిష్కరించిన ఎంఎల్‌ఎ రాజాసింగ్ ఏకంగా బెదిరింపు వీడియో చేశారు. ప్యాన్ ఇండియా, గ్లోబల్ స్థాయి చేరిన 'బాహుబలి'ని హిందువులు బహిష్కరించమంటున్నారు! ఏతావాతా వివాదాలమారి రాంగోపాల్ వర్మ మాత్రమే రాజమౌళికి తోడయ్యారు తప్ప ఘనమైన సినీ దిగ్గజాలందరూ గప్‌చుప్ అనుకోండి. ఇక అసలాయన కూడా ఎలా బయట పడాలా అని చూస్తున్నట్టు కనిపిస్తుంది మరి.



సిజెఐ ఫినిషింగ్ టచ్

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆఖరి దెబ్బతో అదరగొట్టారా? గతంలో ట్రిబ్యునళ్ల సభ్యుల పదవీ కాలం నాలుగేళ్లుగా నిర్ణయించి పొడగింపులు ప్రకటించడంపై సుప్రీంకోర్టు ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. దాంతో అలా చేసేందుకు వీలు కల్పించే చట్టమే తీసుకొచ్చారు. దీనిపై విచారణ మళ్లీ ఆయనే చేపట్టారు. ఎంతకూ నడవకపోతే విసుక్కున్నారు. కావాలని కేంద్రం నేను దిగిపోయాక దీన్ని తీసుకోవాలనుకుంటుందా అని ఆగ్రహించారు. ఎందుకంటే ఆయన ఈ వారం చివరలో పదవీ విరమణ చేస్తున్నారు. ఆయన కోపగించాక అటార్నీ జనరల్ వెంకట రమణి క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఎట్టకేలకు ఆయన బుధవారం తీర్పు వెలువరిస్తూ గత నిర్ణయాన్నే పునరుద్ఘాటించారు. మేము వద్దని తీర్పు చెప్పిన దాన్నే చట్టంగా మళ్లీ తీసుకువస్తారేమిటని ప్రశ్నించారు. మరో కేసులోనూ సుప్రీంకోర్టు ప్రభుత్వ సంస్థలను కాపాడేవిధంగా గత తీర్పును సవరించారు. ఎప్పుడో నిర్మించిన పిఎస్‌యు లు పర్యావరణహితం కాదంటూ ఇప్పుడు తొలగించడం, కూల్చడం సరికాదని తేల్చేశారు (దీనిపై తనతో విభేదించిన మరో న్యాయమూర్తిని తానే అడిగిమరీ అభిప్రాయం చెప్పించారు.). చివరి దెబ్బగా శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై సంతకానికి నిరవధిక జాప్యం రాజ్యాంగబద్ధం కాదని చెప్పేశారు.

◆

మోడీగారూ ... ఇంతవరకేనా!

గతంలో దేశ స్వతంత్రం కోసం పోరాడినవారి బొమ్మలు రూపాయి నాణాల మీద, నోట్ల మీద ముద్రించేవారు. పోస్టల్ స్టాంపులు కూడా విడుదల చేసేవారు. సమాజం కోసం విశిష్టమైన సేవలు చేసిన మరికొంతమంది బొమ్మలు ముద్రించేవారు. అలాగే కొన్ని రంగాలలో సేవలు అందించిన వారికి భారతరత్నలు, 'పద్మ' అవార్డులు గౌరవ సూచకంగా ఇచ్చి సత్కరించేవారు. రానురాను వాటి గౌరవాలు, విలువలు తగ్గుతూ వచ్చాయి. వీరికిస్తే తమ పార్టీకి లాభం వస్తుంది అనుకున్నవారికి ఇవ్వటం మొదలుపెట్టారు. 150 కోట్ల ప్రజలకు ప్రధానిగా వున్న మోడీ ఇటీవల పుట్టపర్తిలో సాయిబాబా బొమ్మతో కూడిన వంద రూపాయల నాణాన్ని, పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ముందుగా ఇది దేశంలోని ప్రజలను అవమానపరచటమే! ఎవరీ సాయిబాబా ఒకసారి ఆలోచించండి మోడీజీ. నోట్లోంచి చిన్నచిన్న లింగాలు తియ్యటం, చేతిలోంచి విభూది తియ్యటం, ఉంగరాలు గొలుసులు తియ్యటం చేసి మహత్యాలుగా ప్రచారం చేసుకొని వేల కోట్లకు అధిపతి అయ్యాడు. 1976లో డాక్టరు కోవూరు బృందం నీ మహిమలు మా ముందు ప్రదర్శించమని పుట్టపర్తి వెళ్లగా బెంగుళూరు పారిపోయాడు. ఈయనగారి నివాసంలో ఆరు హత్యలు జరిగాయి. 1993లో ప్రధాని పి.వి.నరసింహారావు సమక్షంలో ఒక గొలుసు తీసి ఇచ్చే సీను వీడియోలో చిక్కింది. ప్రభుత్వం ఇలాంటి మోసకారి బాబా శతజయంతి జరపడమే ఒక దిక్కుమాలిన పని. అప్రజాస్వామికం. రాజ్యాంగ విరుద్ధం. అలాంటి రాజ్యాంగ విరుద్ధమైన కార్యక్రమానికి మీరు వచ్చి ఇలా చెయ్యటాన్ని ఎలా సమర్థించుకుంటారు మోడీజీ! ఇలాంటి బాబాలు మీ ప్రభుత్వాల పుణ్యామాని దేశంలో గుంపులు గుంపులుగా ఉన్నారు. ఆ యా రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులు వీరి పుట్టిన రోజులు/జయంతులు కూడా జరిపితే వెళ్తారా! సరే ఇంతకీ నాణెం మీద బొమ్మ, పోస్టల్ స్టాంపు వరకే సరిపుచ్చుతారా! లేక భారతరత్న లాంటివి ఏమైనా ఉన్నాయా?

- నార్నె

సెమీస్‌కు లక్ష్యసేన్

● ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ వరుససెట్లలో భారత్‌కే చెందిన ఆయుష్ శెట్టిపై విజయం సాధించాడు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌ను లక్ష్యసేన్ 23-21, 21-11తో ముగించాడు. సెమీస్‌లో లక్ష్యసేన్ చైనీస్ తైపీకి చెందిన టి.సి. ఛౌతో తలపడనున్నాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో వీరు 19-21, 15-21తో మలేషియా జంట చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూశారు.



అసమానతలకు వ్యతిరేకంగా జోహన్నెస్‌బర్గ్‌లో ఆందోళనల దృశ్యం

అసమానతలపై నిరసన జ్వాల

● సంపన్నులపై పన్నులు డిమాండ్

● జోహెన్స్‌బర్గ్‌లో 'జి20' వేదికవద్ద ఆందోళనలు

జోహన్స్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలో జరగనున్న జి20 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో నిరసన గళం వినిపించడానికి ఆందోళనకారులు సిద్ధమవుతున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి సంపన్నులకా లేక సాధారణ ప్రజలకా అని పేదలు, కార్మికులు, మహిళలు, పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తున్నారు. అక్కడి ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. 3,500 మంది అదనపు పోలీసులను మోహరించింది. సైనిక దళాల ప్రదర్శనను నిర్వహించింది. హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. ఆఫ్రికాలో తొలిసారిగా జరుగుతున్న జి20 సదస్సుకు పలువురు అంతర్జాతీయ నేతలు, ప్రముఖులు హాజరుకానున్నారు.

మా భవిష్యత్తు గురించి మాట్లాడని జి20 ఎందుకు?

ఈ సదస్సును పలువురు నిరసనకారులు తమ డిమాండ్లను వినిపించే ఒక వేదికగా మలుచుకుంటున్నారు. జి20 సదస్సుపై పేదలు, కార్మికులు, మహిళలు, యువత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'జి20 ధనికుల విందు.. కానీ బాధ మాత్రం పేదలదే' అని. అసమానతల ప్రపంచంలో అత్యధికంగా దక్షిణాఫ్రికాలో ఉన్నాయి. ఇక్కడ పది శాతం సూపర్‌రిచ్ (అతి సంపన్నులు) దేశ సంపదలో 85 శాతం వాటాను కలిగి ఉన్నారు. మిగిలిన జనాభా కేవలం బతకడానికి పోరాడుతుండటం ఇక్కడి ఆందోళనకర పరిస్థితిని తెలియజేస్తుంది. ఇక నిరుద్యోగం 31 శాతంతో ప్రపంచంలోనే అత్యధిక కావటం గమనార్హం. ఇంతటి అసమానతల నేపథ్యంలో పలువురు రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. అతి సంపన్నులపై పెద్ద మొత్తంలో పన్నులు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. సూపర్‌రిచ్‌లు పన్నుల నుంచి తప్పించుకుంటే.. దేశాన్ని పేదలు నడపాలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ నాయకులు దేశానికి చేరుతున్న సమయంలో తమ స్వరాన్ని మరింత బలంగా వినిపించేందుకు సిద్ధమయ్యారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలియజేసే హక్కు ఉన్నదని, అది చట్టపరిమితికి లోబడి ఉండాలని లెఫ్టినెంట్ జనరల్ మెసికేలీ అన్నారు. సదస్సు వేదిక చుట్టూ నిరసనకారుల కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించారు. జోహన్స్‌బర్గ్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో కూడా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించారు. మహిళా హక్కుల సంఘాలు, వలస వ్యతిరేక గ్రూపులు, పర్యావరణ కార్యకర్తల నుంచి నిరసనలు పెద్ద ఎత్తున జరుగుతాయని భావిస్తున్నారు. మహిళలు పనికి వెళ్లకుండా శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన తెలపాలని 'ఉమెన్ ఫర్ చేంజ్' అనే మహిళా హక్కుల సంఘం పిలుపునిచ్చింది. ప్రతి రెండున్నర గంటలకు ఒక మహిళ హత్యకు గురవుతున్న దేశంలో ప్రగతి గురించి మాట్లాడటానికి జి 20కి హక్కు లేదని ఆ సంఘం వివరించింది. వాతావరణ మార్పు, సంపదలో అసమానతలపై పనిచేసే పలు సంఘాల కూటమి.. గురువారం నుంచి నగరంలోని మరో ప్రాంతంలో సదస్సును నిర్వహిస్తున్నాయి. జి20 ధనవంతుల కోసమేనని ఆరోపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతి ఆఫ్రికన్లపై వర్ణ వివక్షా విధానాలు, దాడులు చేస్తుందని నెపం మోపి జి20 సదస్సును బహిష్కరించిన విషయం విదితమే.

ప్రధాని మోదీ రాక

జి20 వార్షిక సమావేశం నిమిత్తం ప్రధాని మోదీ దక్షిణాఫ్రికా చేరుకున్నారు. వాటర్‌క్లూఫ్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో దిగిన ఆయనకు అధికారులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. "జి20 సమావేశం కోసం జోహన్స్‌బర్గ్‌కు చేరుకున్నాను. కీలక అంశాలపై ప్రపంచాధినేతలతో చర్చించనున్నారు. వివిధ దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, తద్వారా యావత్ ప్రజానీకానికి మెరుగైన భవిష్యత్తును అందించడమే లక్ష్యం" అని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ప్రాణాంతకంగా మారుతున్న ఢిల్లీ గాలి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోద్యాయి. దీంతో ఆ గాలి ప్రాణాంతకంగా మారుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో 80 శాతం నివాసితులు గాలి నాణ్యతలు క్షీణించడం వల్ల అనారోగ్యాలపాలవుతున్నారు. కనీసం కుటుంబంలో ఒక్కరైనా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి. మాస్క్‌లు, ఎయిర్ ప్యూరిఫైయర్‌లు కొంత రక్షిస్తున్నప్పటికీ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏడాది పొడవునా కచ్చితమైన విధాన మార్పు అవసరమని వైద్యులు సూచించారు. కాగా, శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ఎక్యూఐ 370 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ తీవ్ర స్థాయిలో నమోదైంది. చాందినీ చౌక్, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, నరేలా, డిటియు- వజీర్‌పూర్‌లలో 400కి పైగా ఎక్యూఐ నమోదైంది. 18 పర్యవేక్షణా కేంద్రాల్లో 400 పైగానే ఎక్యూఐ నమోదైంది. గత కొన్ని రోజుల్లోనే కాకుండా.. వచ్చే వారంలో ఆరు రోజులు కూడా తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యే అవకాశం ఉందని భూశాస్త్రాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది. గాలి కదలికలు సరిగ్గా లేకపోవడం, శీతాకాలం కారణంగా గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో గాలి ఎంత కాలుష్యంగా ఉందో నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలే నిదర్శనం.

స్టార్క్‌కు ఏడు.. స్టోక్స్‌కు ఐదు...

● యాషెస్‌లో తొలిరోజే 19వికెట్లు పతనం

పెర్త్: యాషెస్ సిరీస్ తొలి రోజునుంచే రసవత్తరంగా మొదలైంది. ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో భాగంగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు బౌలర్ల అధిపత్యం చెలాయించారు. తొలుత ఇంగ్లండ్ 172 పరుగులకే పరిమితం కాగా.. అనంతరం ఆస్ట్రేలియా 123 పరుగులకే 9వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ సంచలన బౌలింగ్‌తో ఆశ్చర్యపరిచాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అరుదైన ఘనత సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంతితో విజృంభించిన అతడు దిగ్గజ కెప్టెన్లకు సాధ్యంకాని రికార్డు తన పేరిట రాసుకున్నాడు. ఈ మైలురాయికి చేరుపైన ఇంగ్లండ్ రెండో కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు స్టోక్స్. అతడికంటే ముందు 1982లో అప్పటి కెప్టెన్ బాబ్ విల్లిస్ ఈ రికార్డు నెలకొల్పాడు. గబ్బా టెస్టులో విల్లిస్ ఐదు వికెట్లతో కంగరూలను కష్టాల్లోకి నెట్టాడు. యాషెస్ టెస్టు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన రెండో ఇంగ్లండ్ సారథిగా అవతరించాడు. తొలి సెషన్ నుంచే ఉత్కంఠ రేపిన పెర్త్ టెస్టులో మొదటిరోజే 19 వికెట్లు పడ్డాయి. అంతకుముందు టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. హ్యారీ బ్రూక్(52) అర్ధసెంచరీకి తోడు పోప్(46), జేమీ స్మిత్(33), డకెట్(21) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. మిచెల్ స్టార్క్ (7/58)కి తోడు డోగెట్‌కు రెండు, గ్రీన్‌కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియాకు మొదటి ఓవర్లోనే జోఫ్రా ఆర్చర్ (2/11)షాకిచ్చాడు. మార్నస్ లబూషేన్(9)తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఓపెనర్ జేక్ వీథర్‌లాండ్(0)ను రెండో బంతికే ఎల్బీగా వెనక్కి పంపాడు. ఆ తర్వాత బ్రైడన్ కార్సే స్టీవ్ స్మిత్(17), ఖవాజా(2)లను ఔట్ చేయగా.. అక్కడి నుంచి బెన్ స్టోక్స్(5/23) జోరు చూపించాడు. మిడిలార్డర్ బ్యాటర్లైన ట్రావిస్ హెడ్(21), కామెరూన్ గ్రీన్(24), అలెక్స్ క్యారీ(26), మిచెల్ స్టార్క్(12), స్కాట్ బోలాండ్(0)లను ఔట్ చేసి ఐదో వికెట్లతో మెరిసాడు. ఆస్ట్రేలియా జట్టు తొలి రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్లకు 123 పరుగులు చేసి ఇంకా 49 పరుగులు వెనకబడి ఉంది.

స్కోర్‌బోర్డు..

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి)ఖవాజా (బి)స్టార్క్ 0, డకెట్ (ఎల్‌బి)స్టార్క్ 21, పోప్ (ఎల్‌బి)గ్రీన్ 46, రూట్ (సి)లబూషేన్ (బి)స్టార్క్ 0, బ్రూక్ (సి)క్యారీ (బి)డోగెట్ 52, స్టోక్స్ (బి)స్టార్క్6, స్మిత్ (సి)గ్రీన్ (బి)స్టార్క్ 33, అట్కిన్సన్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 1, కర్సే (సి)లబూషేన్ (బి)డోగెట్ 6, ఆర్చర్ (నాటౌట్) 0, వుడ్ (సి)క్యారీ (బి)స్టార్క్ 0, అదనం 7. (32.5ఓవర్లలో ఆలౌట్) 172పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/33, 3/39, 4/94, 5/115, 6/160, 7/161, 8/168, 9/172, 10/172

బౌలింగ్: స్టార్క్ 12.5-4-58-7, బోలండ్ 10-0-62-0, డోగెట్ 7-1-27-2, లియాన్ 2-0-10-0, గ్రీన్ 1-0-10-1.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వెథర్లాడ్ (ఎల్‌బి)ఆర్చర్ 0, లబూషేన్ (బి)ఆర్చర్ 9, స్మిత్ (సి)బ్రూక్ (బి)కర్సే 17, ఖవాజా (సి)స్మిత్ (బి)కర్సే 2, హెడ్ (సి)కర్సే (బి)స్టోక్స్ 21, గ్రీన్ (సి)జేమీ స్మిత్ (బి)స్టోక్స్ 24, క్యారీ (సి)కర్సే (బి)స్టోక్స్ 26, స్టార్క్ (సి)కర్సే (బి)స్టోక్స్ 12, లియాన్ (బ్యాటింగ్) 3, బోలండ్ (సి)బ్రూక్ (బి)స్టోక్స్ 0, డోగెట్ (బ్యాటింగ్) 0, అదనం 9. (39 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 123 పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/28, 3/30, 4/31, 5/76, 6/83, 7/118, 8/121, 9/121

బౌలింగ్: ఆర్చర్ 9-4-11-2, అట్కిన్సన్ 9-4-19-0, వుడ్ 5-0-18-0, కర్సే 10-1-45-2, స్టోక్స్ 6-1-23-5.

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు

ఇసి కసరత్తు

కోల్‌కతా : వచ్చే ఏడాది పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) చేపట్టింది. శుక్రవారం ఇసి ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం)ల తనిఖీ, ఓటింగ్ రిహార్సల్స్ ప్రక్రియను చేపట్టింది.

డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ భారతి కోల్‌కతాలో ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సి) సభ్యులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఎస్‌ఐఆర్, ఇవిఎం, వివిప్యాట్ స్టాక్‌ను నిర్వహించే సన్నాహాలు, ఇతర విషయాల గురించి ఆయన ఎఫ్‌ఎల్‌సి సభ్యులతో చర్చించారు. ఇవిఎంలలో ఎలాంటి సమాచారం అందుబాటులో ఉండాలనే దానిపై ఎన్నికల సంఘం కొత్త నియమాలను ప్రవేశపెట్టింది. ప్రతి నియోజకవర్గంలో ప్రతి అభ్యర్థి ఫొటో ఇవిఎం బటన్ పక్కన ఉంటుంది. ముందు ట్రైల్స్‌లో కూడా చూపుతుందని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

టీచర్లకు బోధనేతర బాధ్యతలు ఉండవు

- మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు ఉండవని మంత్రి లోకేష్ తెలిపారు. ఎపిటిఎఫ్ అధ్యక్షులు సిహెచ్ మంజుల, మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్.. మంత్రి లోకేష్‌తో ఆయన నివాసంలో శుక్రవారం భేటీ అయ్యారు. డిసెంబరులో నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మినహా ఈ విద్యా సంవత్సరంలో మరే విద్యేతర పనులు ఉండవని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయులంతా లెర్నింగ్ అవుట్‌కమ్స్‌పై శ్రద్ధ పెట్టాలన్నారు. ఫ్యాప్టో 17 నెలల్లో 423 సమస్యలు తన దృష్టికి తెచ్చిందని, ఇందులో 200 సమస్యలు పరిష్కరించామని తెలిపారు.

హోంగార్డుల వేతనాలు పెంచాలని సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని హోంగార్డులకు వేతనాలు పెంచేందుకు, సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల మంది హోంగార్డులు సేవలందిస్తున్నారని, శాంతి భద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడటంలో హోంగార్డులు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. 2019 నుంచి రోజుకు కేవలం రూ.710 వేతనంతో పని చేస్తున్నారని, సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు వీరి వేతనాలను రూ.1,124 చెల్లించాల్సి ఉందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని హోంగార్డులకు పూర్తి స్థాయి వేతనాలు వెంటనే అమలు చేయాలని కోరారు. వాషింగ్, కవాతు అలవెన్స్‌లు, టిఎ, డిఎలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని, డెత్ ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు, ఉద్యోగ విరమణ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. హోంగార్డుల కుటుంబాలకు 3 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని, పెన్షన్ వ్యవస్థను ఏర్పాటుచేయాలని లేఖలో కోరారు.

కౌలు రైతులకు రెండేళ్లు కౌలు లేకుండా అవకాశం

- ఎపి కౌలు రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపానుతో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, ఆలయ భూములు సాగుచేస్తున్న కౌలు రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని ఎపి కౌలు రైతు సంఘం పేర్కొంది. కౌలు రైతులకు రెండేళ్ల కౌలు లేకుండా భూములు సాగుచేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శుక్రవారం దేవాదాయశాఖ కమిషనరు రామచంద్ర మోహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తుపానుతో వరి, పత్తి వంటి అనేక పంటల్లో తక్కువ దిగుబడి వస్తోందని, ఆలయ భూములు సాగుచేస్తున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అరటి, బొప్పాయి వంటి తోటలు పడిపోతే వాటిని శుభ్రం చేయడానికి చాలా ఖర్చవుతుందని, ఈ నేపథ్యంలో కౌలు రైతులకు ఆసరాగా నిలబడేందుకు కౌలు మినహాయింపునివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. పంట నూర్పిడి తర్వాత కౌలు చెల్లించే కౌలు రైతులకు కౌలు సగం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

33 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసాం : రష్యా రక్షణ శాఖ

మాస్కో : 33 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకుని, ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. క్రిమియా, నల్లసముద్రం సహా ఐదు రష్యన్ ప్రాంతాలపై గురువారం అర్థరాత్రి ఉక్రెయిన్ పదుల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించిందని ప్రకటించింది. సైన్యం వాటిని అడ్డుకుని, విజయవంతంగా ధ్వంసం చేసిందని వెల్లడించింది. డ్రోన్ల ప్రయోగంతో సుమారు ఎనిమిది విమానాశ్రయాల్లో కార్యకలాపాలను నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపింది. దక్షిణ రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని అత్యవసర కేంద్రం తెలిపింది. డ్రోన్ దాడి కారణంగా పాఠశాలలు, కిండర్ గార్డెన్‌లలో తరగతులను నిలిపివేసినట్లు పేర్కొంది. రోస్టోవ్ ప్రాంతంలో ఏడు డ్రోన్లను కూల్చివేశామని, ఒక విద్యుత్ స్తంభం దెబ్బతిందని తెలిపింది.

అట్రాసిటీ కేసులులేని జిల్లాగా 'మన్యం'

- జిల్లా, అధికార యంత్రాంగానికి ఎస్‌సి కమిషన్ చైర్మన్ అభినందనలు

ప్రజాశక్తి- పార్వతీపురం

2025 జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకూ ఒక్క అట్రాసిటీ కేసు కూడా నమోదు కాని జిల్లాగా పార్వతీపురం మన్యం ఉండడం గర్వకారణమని రాష్ట్ర ఎస్.సి.కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ పేర్కొన్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగాన్ని, అధికారులను, ప్రజలను, ప్రజాప్రతినిధులను, మీడియాను అభినందిస్తున్నట్లు తెలిపారు. పార్వపురం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై జిల్లా అధికారులతో కమిషన్ చైర్మన్ సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రత్యేకంగా ఎస్‌సి కమిషన్ పర్యటన చేసిందన్నారు. ఇక్కడ సమర్థులైన అధికారులు ఉన్నారని, ఒక్క అట్రాసిటీ కేసు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. వాస్తవాలను వెలుగులోకి తీసే సమయంలో అధికారుల దృష్టికి అట్రాసిటీ కేసులు వస్తే, వాటిని తమకు తెలియజేయాలని, వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

విద్యాసంస్థల్లో రాజకీయ ప్రసంగాలకు నో



లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రసన్న కుమార్, తదితరులు

- విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో మంత్రి లోకేష్
- విడతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని కళాశాలలు, యూనివర్సిటీల్లో రాజకీయ ప్రసంగాలను అనుమతించబోమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశ నిర్ణయాలను లోకేష్ కార్యాలయం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. విద్యార్థి సంఘ నాయకులకు ఆయా విద్యాసంస్థల పనివేళలు పూర్తయిన తర్వాత రాజకీయేతర సమస్యలపై చెప్పుకోవడానికి ప్రత్యేక వేదికపై అవకాశమిస్తామన్నారు. విద్యార్థి సంఘాలు కళాశాలల్లో నిర్వహించే యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ క్యాంపెయిన్‌కు సహకరిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం రూ.4,200కోట్లు పెండింగ్‌లో పెట్టిందని, ఆర్థిక వెసులుబాటు చూసుకొని దశలవారీగా చెల్లిస్తామన్నారు. ఈ విషయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సారి కళాశాలల్లో అడ్మిషన్లు ఆలస్యం కాకుండా తగు చర్యలు చేపడతామన్నారు. వచ్చే ఏడాది షెడ్యూల్ ప్రకారమే సెట్‌ల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించి యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 4,300 అధ్యాపక పోస్టులను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకొచ్చారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘ నాయకుల ప్రవేశాన్ని నిషేధిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించాలని, జివో 77ను రద్దు చేయాలని, కామన్ పిజి సెట్ రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్ల అమ్మకానికి సంబంధించిన జివో 107,108లను రద్దు చేయాలని కోరారు. హాస్టళ్ల మెస్ చార్జీలు పెంచాలని, వాటిల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వం విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, పి రామ్మోహన్, కె శివారెడ్డి, బి నాజర్, జి వాలరాజు(ఎఐఎస్‌ఎఫ్‌ఐ), భాస్కర్ వినోద్(పిడిఎస్‌యు), వి శ్రీనివాసరావు(ఎన్‌ఎస్‌యుఐ), భానుసూరి(పిడిఎస్‌వో), పి రాజేంద్రబాబు, యుగంధర్(ఎఐవైఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

'ఆ'ఉత్తర్వులు సవరిస్తామని హామీ ఇచ్చారు : : విద్యార్థి సంఘాలు

విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలకు ప్రవేశం లేకుండా ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తామని మంత్రి లోకేష్ తమకు హామీ ఇచ్చారని విద్యార్థి సంఘాలు వెల్లడించాయి. మంత్రి లోకేష్‌తో సమావేశం ముగిసిన అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్,పిడిఎస్‌యు, పిడిఎస్‌ఓ, ఎన్‌ఎస్‌యుఐ,ఎఐవైఎఫ్ ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశాయి. విద్యార్థుల సమస్యలపై చర్చించేందుకు విద్యార్థి సంఘాలను మంత్రి లోకేష్ ఆహ్వానించారని తెలిపాయి. ఈ సమావేశంలో రాజకీయ ప్రసంగాలు, జెండాలు అనుమతించోమంటూ లోకేష్ చెప్పగా తాము విద్యార్థుల సమస్యలపై కృషి చేసే విద్యార్థి సంఘాలమని, రాజకీయాలు మాట్లాడానికి తాము రాజకీయ పార్టీల నేతలం కాదని స్పష్టం చేశామని వెల్లడించాయి. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలను అనుమతించేందుకు తక్షణం ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపాయి.పిపిపి విధానంలో మెడికల్ కళాశాలలను దర్దు చేయాలని విద్యార్థి సంఘాలు కోరగా మంత్రి నిరాకరించారని పేర్కొన్నాయి. పిపిపికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మంత్రితో స్పష్టం చేశామని తెలిపాయి. తమ సంఘాలతో జరిపిన చర్చల్లో పరిష్కరిస్తామని అంగీకరించిన అంశాలను తుచా తప్పకుండా అమలు చేయాలని కోరాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామని చెప్పిన అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నాయి. హామీలు అమలు చేయని పక్షంలో విద్యార్థి సంఘాలు ఐక్యకార్యచరణతో పోరాటాలకు సిద్ధమవుతాయని హెచ్చరించాయి.

పనులు తొలగిస్తే సహించం

- ఢిల్లీలో హర్యానా ఉపాధి హామీ కార్మికుల నిరసన

చండీఘర్ : హర్యానాకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి కార్మికులు శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపారు. ఈ పథకం కింద అనుమతించిన పనుల జాబితా నుండి అనేక పనులను తొలగించడంతో తమకు ఉపాధి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు నెలలుగా తమకు పనులు లేవని చెప్పారు. 'కచ్చే కామ్' అని పిలిచే నీటి సంరక్షణ, నీటిపారుదల, చెరువుల పునరుద్ధరణ, కరువు నివారణ, గ్రామీణ అనుసంధానం, భూ అభివృద్ధి వంటి నైపుణ్య రహిత కార్మికులు అవసరమయ్యే పనులను జాబితా నుండి తొలగించారని కార్యకర్త ధీరజ్ గభా పేర్కొన్నారు. జిల్లాల వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామని అన్నారు. ఇది కేంద్ర నిర్ణయమని స్థానిక యంత్రాంగం పేర్కొందని, అందుకే ఢిల్లీలో నిరసన తెలిపామని అన్నారు. ఈ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాల సమయంలో లక్షమంది ఉపాధి కార్మికులు ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపడతారని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల నుండి రుణాలు తీసుకున్న చాలామంది మహిళలు వాటిని తిరిగి చెల్లించలేక ఆందోళన చెందుతున్నారని, వారికి రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనుమతించబడిన పనులను పరిమితం చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్రీయ మజ్దూర్ కిసాన్ మంచ్, క్రాంతికారి నరేగా మజ్దూర్ యూనియన్, నరేగా మజ్దూర్ ఏక్తామంచ్, నరేగా మేట్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేశాయి. గతంలో ఉన్న పనులను పునరుద్ధరించాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరాయి.

మరణించినా జీవించాడు

- బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవదానం

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం)



మరణించినా ఆ వ్యక్తి జీవించే ఉన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన ఆ వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి పలువురికి జీవం పోసి ఆదర్శంగా నిలిచారు. విజయనగరంలోని కెఎల్ పురానికి చెందిన శిగడం ఆదినారాయణ (54) ఈ నెల 19న హై బీపీ రావడంతో ఇంటి వద్ద కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని తిరుమల-మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు శరీరం సహకరించకపోగా కోమాలోకి వెళ్లారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. ఆ కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో, శుక్రవారం ఉదయం తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఇన్‌ఛార్జి మల్లికార్జున్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు న్యూరో ఫిజీషియన్ రెడ్డి సుధీర్ నాయుడు, న్యూరో సర్జన్ హేమస్వరూప్, ఐసియు ఇంఛార్జి అంబల్ల జగదీష్, మత్తు వైద్యనిపుణులు దుర్గాప్రసాద్ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కష్టపడి అవయవాలను తీశారు. ఆదినారాయణ రెండు నేత్రాలు, రెండు కిడ్నీలను విశాఖపట్నం కిమ్స్‌కు తరలించారు.

అభివృద్ధి పేరిట కొండలు ధ్వంసం

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)



కొండ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

అభివృద్ధి పేరుతో భూ దోపిడీకి పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములే కాక రైతుల పంట పొలాలనూ వదలడం లేదని వాపోతున్నారు. ఎటునుంచి ఏ అధికారి భూముల వద్దకు వస్తారోనని భయపడుతున్నారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో విఎంఆర్‌డిఎ అధికారులు సర్వే పేరిట సంచరించారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో వారు వెనుదిరిగారు. భూముల వద్దకు రానప్పటికీ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల విఆర్‌ఒల సహకారంతో భూరికార్డులను పరిశీలిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం.

మరోపక్క శుక్రవారం చెరుకుపల్లి పరిధిలోని సర్వే నంబర్ 1లో కొండ భూములను విఎంఆర్‌డిఎ అధికారులు, సర్వే ఏజెన్సీ సిబ్బందితో వచ్చి రహస్యంగా సర్వే చేస్తుండగా, ఆ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని సర్వే సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామస్తులకు తెలియకుండా, చివరికి విఆర్‌ఒ కూడా లేకుండా తమ గ్రామంలో సర్వే ఎలా చేస్తారంటూ నిలదీశారు. తమకేమీ తెలియదని విఎంఆర్‌డిఎ అధికారులు పురమాయిస్తేనే.. విజయనగరం జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ భగవాన్ దాస్ ఆధ్వర్యంలో వచ్చి సర్వే చేస్తున్నామని వారు తెలిపారు. ఇదే విషయమై మండల సర్వేయర్ శివాజీని వివరణ కోరగా, విఎంఆర్‌డిఎ అధికారులు ఆర్‌డిఒను సంప్రదించగా, వారు జిల్లా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను మండలానికి పంపించి సర్వే చేస్తున్నారని చెప్పారు. ఈ కొండపై ఇప్పటికే వివాదం ఉంది. మాజీ సైనికోద్యోగులకు కేటాయించారంటూ కొండను చదును చేయడానికి కొందరు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో, ఆ ప్రయత్నానికి కొంత విరామం ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొండవైపు ఎవరూ రాలేదు. మరలా ఆ కొండను కబ్జా చేసేందుకు ఇప్పుడు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మొత్తం 53.95 ఎకరాల కొండ భూమి ఉండగా కొంతభాగంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగతా భూమి ఏదో రకంగా లాగేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. చెరుకుపల్లివాసులు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు.

పక్షి ప్రమాద రహితంగా ఎయిర్‌పోర్టు

- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విజయనగరం)



భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని పక్షి ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మొట్టమొదటి ఏరోడ్రోమ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ప్రకృతికి అనుకూలంగా సురక్షితమైన, సుస్థిరమైన విమానాశ్రయ వాతావరణాన్ని కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అంతర్జాతీయ విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా, విమానాశ్రయం చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో పక్షి ప్రమాదం లేని ప్రాంతాన్ని సృష్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. విమానాశ్రయానికి సమీపంలో పశువులు, వన్యప్రాణుల ప్రమాద నిర్వహణ, చెత్త, వ్యర్థాల తొలగింపు, వాటి నియంత్రణకు పటిష్టమైన చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. దీనికోసం స్థానిక పరిపాలన యంత్రాంగానికి, విమానాశ్రయ నిర్వహణ సంస్థకు మధ్య పరస్పర సహకారం ఉండాలన్నారు. ఈ మేరకు విమానాశ్రయం సమీపంలోని ఇఒపిఆర్‌డిలకు, ఎంపిడిఒలకు, పంచాయతీ కార్యదర్శులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని డిపిఒకు సూచించారు. పర్యావరణ భద్రత, నిర్వహణలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో భోగాపురం విమానాశ్రయం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లక్కీ వర్మ భాస్కర్, ప్రాజెక్ట్ హెడ్ బిహెచ్ఎ రామరాజు, పర్యావరణ నిపుణులు ఎజెడి కార్తీక్, వన్యప్రాణి రక్షణ నిపుణులు బిభూ పాండే, డిఎంహెచ్ఒ జీవన రాణి, ఆర్‌డిఒ డి.కీర్తి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఇంజినీర్ సరిత, డిపిఒ మల్లికార్జునరావు, డిఎఫ్ఒ రామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో డోలీ రహిత గ్రామాలు కావాలి

ప్రతి గ్రామానికీ ఆటో, అంబులెన్సు వెళ్లాలి : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- పార్వతీపురం



డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు

గతంలో రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారులు వేసేలా నిర్ణయం తీసుకున్నామని, వాటిలో వంద పూర్తి కాగా, మిగిలిన 170 రహదారులను ఏడాదిలోగా పూర్తి చేయాలని పంచాయతీ, గిరిజన సంక్షేమ శాఖల ఇంజనీరింగ్ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రానున్న రెండేళ్లలో జిల్లాను డోలీ రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. శుక్రవారం విజయనగరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలోనూ, అనంతరం విలేకర్ల సమావేశంలోనూ ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి అత్యవసర పరిస్థితుల్లో ఆటో, అంబులెన్సు వంటి వాహనాలు చేరుకునేలా పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో సరైన వసతులు లేనందున అనారోగ్యానికి గురికావాల్సి వచ్చిందని, ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని అన్నారు. వర్షాలతో దెబ్బతిన్న పత్తి రైతులకు న్యాయం చేయడంతోపాటు చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అధికారుల చొరవతో కేవలం ఎనిమిది గంటల్లోగా నగదు జమ అవుతుందని తెలిపారు.

జనవరి 26 నాటికి కుంకీ ఏనుగులు రాక

వచ్చే ఏడాది జనవరి 26 నాటికి కుంకీ ఏనుగులు జిల్లాకు రానున్నాయని చెప్పారు. జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కుంకీ ఏనుగుల నివాసానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

స్పెషలిస్ట్ వైద్యులను బలవంతంగా తీసుకురాలేం

మన్యం జిల్లా కేంద్రంతో పాటు పలాస, ఇచ్ఛాపురం వంటి మారుమూల ప్రాంతాలకు గుండె, ఇతర విభాగాల స్పెషలిస్ట్ వైద్యుల్ని బలవంతంగా తీసుకురాలేమని, ఎవరైనా వస్తామంటే నియమిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యులు రావడానికి ఇష్టపడడం లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు ప్రత్యేక జీతభత్యాలతో పాటు వసతి సౌకర్యాలు కల్పిస్తే వస్తారని చెప్పారు. దీనిపై ప్రభుత్వానికి రెండు సూచనలు చేసినట్లు తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు ప్రత్యేక జీతభత్యాలతోపాటు వసతి సౌకర్యాలు కల్పించడం లేదా ఆ ప్రాంతాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యుల కోసం ప్రత్యేక నియామకం చేపట్టాలని కోరామని చెప్పారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎఎన్‌యు ఇన్‌ఛార్జి విసి గంగాధర్‌రావు, రెక్టార్ శివరామప్రసాద్, చిత్రంలో ప్రొ. విజయలక్ష్మి, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

ఎఎన్‌యులో డ్రాఫ్టింగ్, ప్లీడింగ్స్ కోర్సు

- బ్రోచర్ ఆవిష్కరించిన ఇన్‌ఛార్జి విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

న్యాయ వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా డ్రాఫ్టింగ్, ప్లీడింగ్స్ అంశాల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ కోర్సు బ్రోచరును శుక్రవారం నాడు విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ కె గంగాధర్‌రావు, రెక్టార్ ఆర్ శివరామప్రసాద్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎస్ విజయలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ శివరాం, అభిలాష్ గోపీనాథన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ..న్యాయ వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సుకు రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. అత్యున్నత ప్రమాణాలతో న్యాయ విద్యను అందించేందుకు ఎఎన్‌యు కృషి చేస్తోందని తెలిపారు. ప్రొఫెసర్ ఎస్ విజయలక్ష్మి మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో డ్రాఫ్టింగ్, ప్లీడింగ్స్ చాలా కీలక పాత్ర పోషిస్తాయని, కోర్టు వ్యవహారాలతో ముడిపడి వివిధ విభాగాల్లో పనిచేస్తున్నవారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని తాము ఈ సర్టిఫికేట్ కోర్సును తీసుకొచ్చామన్నారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో పాటు పదో తరగతి కనీస విద్యార్హత ఉన్న నాన్ జ్యుడీషియల్ సిబ్బంది, కోర్టు గుమస్తాలు, టైపిస్టులు కూడా ఈ కోర్సు చేయడానికి అర్హులని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సు ఫీజు రూ.10 వేలుగా నిర్ణయించామని, ఎఎన్‌యులోని విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి 50 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. దరఖాస్తు, ఇతర వివరాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వెబ్సైట్‌లో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఈ నెల 5న విడుదల చేసిన ప్రకటన చూడాలని ఆమె సూచించారు.



గుండె శస్త్ర చికిత్స విజయవంతమై ఇంటికి చేరుకున్న వహీదా

చిన్నారి గుండె శస్త్ర చికిత్సకు స్పీకర్ అయ్యన్న సాయం

ప్రజాశక్తి- గొలుగొండ (అనకాపల్లి)

గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి చెందిన చిన్నారి షేక్ వహీదా బేగం గుండె సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసి శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సాయం అందించారు. చిన్నారి గుండెలో రంధ్రం ఉండడం వల్ల ఆపరేషన్‌కు విశాఖపట్నం ఆస్పత్రిలో సుమారు రూ.5 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. చిన్నారి కుటుంబానికి అంత స్థోమత లేకపోవడంతో స్థానిక నాయకులు కామిరెడ్డి గోవింద్, షేక్ అజీన్ ఈ విషయాన్ని స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఈ విషయాన్ని స్పీకర్‌కు తెలియజేయడంతో ఆయన స్పందించారు. చిన్నారి వహీదాను తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తక్షణ చికిత్స నిమిత్తం పంపించారు. అక్కడి డాక్టర్లతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా ఫోన్‌లో మాట్లాడి పాపపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో అక్కడి వైద్య సిబ్బంది మందులతో వహీదాను క్షేమంగా ఇంటికి పంపించారు. కోలుకున్న చిన్నారిని శుక్రవారం కామిరెడ్డి గోవింద్, గ్రామ నాయకులు పరామర్శించారు. తమ బిడ్డకు ప్రాణం పోసి, క్షేమంగా ఇంటికి తీసుకొచ్చినందుకు స్పీకర్ కుటుంబానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామంటూ వహీదా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

పారదర్శకంగా భూముల రీసర్వే

- రాష్ట్ర శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

పదేపదే తలెత్తుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర ప్రణాళికతో కార్యాచరణ రూపొందించాలని, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆచరణలో పెట్టి అమలు చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు, రెవెన్యూ శాఖ అధికారులను రాష్ట్ర శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఆదేశించారు. కమిటీ సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజులతో కలిసి శుక్రవారం విశాఖ జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ మీటింగ్ హాలులో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమగ్ర భూ రీసర్వే, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ, తహశీల్దార్ల పాత్ర, ప్రభుత్వ, ప్రయివేటు భూముల వర్గీకరణ, సర్వే ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. సర్వే, రెవెన్యూ చట్టాల్లో తీసుకురావాల్సిన సవరణలు, జిఒలపై చర్చించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా, గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా ఏయే పనులు చేయాలో తెలియజేశారు. రైతుల సమక్షంలోనే ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మెజిస్ట్రేట్ బృందాలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రీసర్వేకు సంబంధించిన వివరాలను సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ కమిటీకి వివరించారు.

మీడియా గొంతునొక్కొద్దు

- కాశ్మీర్ టైమ్స్‌పై దాడులను ఖండించిన డిఐజిఐపియుబి

న్యూఢిల్లీ : జర్నలిజం నేరం కాదని, మీడియా గొంతునొక్కొద్దని డిఐజిఐపియుబి న్యూస్ ఇండియా ఫౌండేషన్ డిమాండ్ చేసింది. జమ్ము కాశ్మీర్ పోలీసుల రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎస్ఐఎ) కాశ్మీర్ టైమ్స్‌పై జరిపిన "దాడులు, పెరుగుతున్న వేధింపులను శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. "స్వతంత్ర, విశ్వసనీయ వార్తా సంస్థను ఈ విధంగా లక్ష్యంగా చేసుకోవడం పత్రికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి" అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఎస్ఐఎ దాడులు నిర్వహించిన కార్యాలయం నాలుగేళ్లుగా మూసివుందని తెలిపింది. "ధ్రువీకరణ, బ్యాక్‌గ్రౌండ్ తనిఖీలు" పేరుతో జమ్ముకాశ్మీర్‌లో తమ సంఘం సభ్యులు సహా జర్నలిస్టులు బెదిరింపులకు గురవుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేసింది. కాశ్మీర్‌లోని పలువురు జర్నలిస్టులకు ప్రభుత్వ కార్యాలయాల నుండి నెలలో పలుమార్లు బ్యాక్‌గ్రౌండ్ తనిఖీలు, ధ్రువీకరణకు సంబంధించి కాల్స్ వస్తున్నాయని పేర్కొంది.

దాడులు ఆందోళనకరం : సిపిజె

కాశ్మీర్ టైమ్స్‌పై ఎస్ఐఎ దాడులను 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె)' ఖండించింది. వార్తాసంస్థలు తమ విధులను నిర్వహించినందుకు శిక్షార్హమైన చర్యలను ఎదుర్కోకూడదని పేర్కొంది.

పశ్చిమబెంగాల్, జార్ఖండ్‌లలో ఇడి సోదాలు

కోల్‌కతా/రాంచీ : బొగ్గు మాఫియా, మైనింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. రెండు రాష్ట్రాల్లోని సుమారు 45 ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి వంద మందికి పైగా ఇడి అధికారులు, సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు. జార్ఖండ్‌లో సుమారు 18 ప్రాంతాల్లో, పశ్చిమబెంగాల్‌లోని పురులియా, దుర్గాపూర్, హౌరా, కోల్‌కతా జిల్లాల్లోని సుమారు 24 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.

అల్‌ఫలా యూనివర్శిటీపై సిట్

న్యూఢిల్లీ : ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసినట్లు అక్కడి పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన సిట్ ఏర్పాటు చేశామనిఫరీదాబాద్ పోలీస్ ప్రతినిధి చెప్పారు. యూనివర్శిటీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికను సిట్ రూపొందిస్తోందని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి యూనివర్శిటీకి చెందిన పలువురు వైద్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దర్యాప్తు సంస్థలు క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్యాబ్ డ్రైవర్ ధౌజ్ గ్రామానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు నుహ్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నాయి. సోహ్నా సమీపంలోని రాయ్‌పూర్ గ్రామంలోని షాహిజామా మసీదు నుండి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు శుక్రవారం జిహెచ్‌ఎంసి నోటీసులు జారీ చేసింది. ఈ రెండు సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు తక్కువ చెల్లిస్తున్నట్లు బల్దియా అధికారులు గుర్తించారు. వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా ట్యాక్స్ ఎగవేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అన్నపూర్ణ స్టూడియోస్ లక్షా 92 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపారం చేస్తూ కేవలం 8,100 చదరపు అడుగులు చూపిస్తున్నారన్నారు. దీనికి రూ. 11,52,000 చెల్లించాల్సి ఉండగా, రూ.49వేలు మాత్రమే ట్యాక్స్ పే చేస్తున్నట్లు తెలిపారు. రామానాయుడు స్టూడియోస్ 68,000 చదరపు అడుగుల్లో వ్యాపారం చేస్తూ కేవలం 1900 చదరపు అడుగులకు మాత్రమే ట్యాక్స్ పే చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. రూ.2,73,000 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.7,600 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. దీంతో పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి అని హెచ్చరికలు జారీ చేస్తూ జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారుల ఈ రెండు సంస్థలకు నోటీసులు ఇచ్చారు.

బంగ్లాదేశ్‌లో భూకంపం

- ఎనిమిది మంది మృతి

ఢాకా : బంగ్లాదేశ్‌లో శుక్రవారం ఉదయం సంభవించిన భారీ భూకంపంలో ఎనిమిది మంది మృతి చెందారు. సుమారు 450 మంది గాయపడ్డారు. ఉదయం 10:08 గంటలకు సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.7గా నమోదైందని జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియో సైన్సెస్ (జిఎఫ్‌జెడ్) తెలిపింది. భూకంప కేంద్రం రాజధాని ఢాకా నుంచి తూర్పు ఆగ్నేయంగా 25 కిలోమీటర్ల దూరంలో, 10 కిలో మీటర్ల లోతున ఉందని వెల్లడించింది. ఈ భూకంప దాటికి అనేక ఇళ్లు కుప్పకూలిపోయాయి. ఢాకాలోనే ఆరుగురు మృతి చెందారు. ఈ భూకంప ప్రభావం పశ్చిమ బెంగాల్ రాజధాని కొల్‌కతా, సమీప ప్రాంతాల వరకు కనిపించింది.

కృష్ణాజలాల ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండి

(మొదటిపేజీ తరువాయి)

11 షెడ్యూల్‌ను కాదని, కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అక్టోబరు 6, 2023న టిఓఆర్ జారీచేస్తూ ఎపిలో అవిభాజిత వాటాగా ఉన్న నీటిని పరిగణనలోకి తీసుకుంటూ ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు కృష్ణాజలాల కేటాయింపు సమీక్షించాలని ట్రిబ్యునల్ ఆదేశించిందని తెలిపారు. వెంటనే దాన్ని అప్పటి వైసిపి ప్రభుత్వం సవాల్ చేసిందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసిందని వివరించారు. దీనిపై అనంతరం టిడిపి ప్రభుత్వం వాదనలు వినిపించడంలో విఫలమైందని పేర్కొన్నారు. దీనిపై 2024 ఆగస్టు 27న ట్రిబ్యునల్ విచారణ మొదలుపెట్టిందని పేర్కొన్నారు. తెలంగాణా మాత్రం 811 టిఎంసిల్లో 71 శాతం నీరు కేటాయించాలని కోరుతోందని పేర్కొన్నారు. రెండో ట్రిబ్యునల్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది గోయల్ దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. గతకొద్దికాలంగా కృష్ణానదిలో వస్తున్న వరదలు పూర్తిస్థాయిలో ప్రాజెక్టులు నింపడానికి సరిపోతోందని, ఏ ఏడాది కూడా అవసరాలకు మించి రాలేదని పేర్కొన్నారు. మొదటి ట్రిబ్యునల్ కేటాయించిన విధంగా శ్రీశైలంలో 150 టిఎంసిల నిల్వతరువాత మిగిలిన ప్రాజెక్టుకు నీటి విడుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అన్ని కేటాయింపుల తరువాతే శ్రీశైలం నుండి వెళ్లే ప్రాజెక్టులకు నీటిని కేటాయిస్తామని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. తొలి నుండీ టిడిపి ఈవైఖరి తీసుకుందని అన్నారు. తెలంగాణా ప్రభుత్వం 2025 సెప్టెంబర్ 16న జిఓ నెంబరు 34 విడుదల చేసిందని వివరించారు. అదేరోజు కర్నాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తును 519.16 మీటర్ల నుండి 524.25 మీటర్లకు పెంచడం వల్ల నీటిసామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని కోరారు.

కార్మిక హక్కులు హరించడమే

- లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌పై కార్మిక సంఘాల ఆగ్రహం
- మోడీ సర్కారు తీరును నిరసిస్తూ 26న దేశవ్యాప్త నిరసనలకు పిలుపు



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని, వారిని మోసగిస్తోందని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక విమర్శించింది. శుక్రవారం నాడు న్యూఢిల్లీలో సమావేశమైన జాతీయ కార్మిక సంఘాల సంయుక్త వేదిక ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం నుంచి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఏకపక్షంగా అమలులోకి తీసుకురావడాన్ని ఖండించాయి. నోటిఫై చేసిన లేబర్ కోడ్‌లు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తాయని, కార్మికుల సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలను ప్రారంభం నుంచి కార్మికులు వ్యతిరేకిస్తున్నా కేంద్రం మొండిగా ముందుకెళ్తుందని, 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ చట్టాలను తీసుకొచ్చిందని ప్రకటనలో తెలిపింది.

2019లో వేతనాల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే కార్మికులు నిరసనలు తెలిపారు. దాని తరువాత జనవరి 2020న దేశవ్యాప్తంగా శ్రామికులు సాధారణ సమ్మె నిర్వహించి తమ నిరసన గళాన్ని వినిపించారు. మరో మూడు కార్మిక కోడ్‌లైన పరిశ్రమ సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం-పని పరిస్థితులపై కోడ్‌లను అదే ఏడాది సెప్టెంబరులో అమల్లోకి తీసుకొచ్చిందని ప్రకటనలో కార్మిక సంఘాలు గుర్తు చేశాయి. దీన్ని వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తో కలిసి కార్మిక సంఘాలు 'చలో ఢిల్లీ' నిర్వహించినా మోడీ ప్రభుత్వంలో చలనం రాలేదని విమర్శించాయి. జులై 9న నిర్వహించిన చారిత్రాత్మక దేశవ్యాప్త సమ్మెలో దాదాపు 25 కోట్లకు పైగా కార్మికులు పాల్గొన్నారని, కార్మికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఉన్నప్పటికీ కేంద్రం లేబర్ కోడ్‌లను అమలు చేయడానికే సిద్ధపడిందని పేర్కొన్నాయి. బీహార్ ఎన్నికలు అయ్యేంత వరకూ వేచిచూసి, ఫలితాలు అనుకూలంగా వచ్చిన వెంటనే కార్మికవర్గంపై దాడిని తీవ్రతరం చేసిందన్నారు. వెంటనే ఐఎల్‌సి (భారత కార్మిక సభ)ను సమావేశపర్చాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే 2015 నుంచి ఐఎల్‌సిని సమావేశపరచడం లేదని పేర్కొన్నారు. మునాయిదాపై జరిగిన సమావేశంలోనే నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు.

కార్మిక సంఘాల విజ్ఞప్తులను, నిరసనలను, సమ్మెలను పట్టించుకోకుండా కేంద్రం బడ్జెట్ సమావేశాలకు ముందు తమకు అనుకూలమైన వారితో సమావేశమై లేబర్ కోడ్స్‌ను యజమానులకు అనుకూలంగా, కార్మికులకు ప్రతికూలంగా మార్పులు చేశారని విమర్శించారు. ఇది తిరోగమన చర్య అని, కార్మిక హక్కులను కాలరాసే చట్టాలను ఖండిస్తున్నామని ప్రకటించారు. శ్రామికులపై దాడిని ప్రతిఘటించాలని, ఐక్యంగా కేంద్రాన్ని నిలువరించాలని పిలుపునిచ్చారు. కార్మికులను బానిసలుగా ఈ చట్టాలు చేస్తాయన్నారు. జీవనోపాధిపై కేంద్రం చేస్తున్న దాడిగా అభివర్ణించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న తరుణంలో కేంద్రం శ్రామికులపై యుద్ధం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం (కిసాన్ సంయుక్త మోర్చా)ను కలుపుకుని ఈ నెల 26న దేశవ్యాప్తంగా కార్మికులు పని ప్రదేశాల్లో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. సోమవారం నుంచి గేట్ మీటింగ్‌లు, నివాస ప్రాంతాల్లో జనరల్ బాడీ మీటింగ్‌లు తక్షణమే నిర్వహించాలని కార్మికులను కోరింది. వెంటనే ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేని పక్షంలో పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని కేంద్రాన్ని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక హెచ్చరించింది. ఈ ప్రకటనపై సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, టియుసిసి, ఎస్‌ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి నేతలు సంతకాలు చేశారు.



తమవారిని కడసారి చూసేందుకు ఆస్పత్రి వద్ద పడిగాపులు కాస్తున్న మావోయిస్టుల కుటుంబీకులు

మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి జిల్లా)

మారేడుమిల్లి ఏజెన్సీలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు రంపచోడవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. శుక్రవారం జ్యోతి, మల్ల అలియాస్ మల్లాలు, లోకేష్ అలియాస్ గణేష్ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో, ఇప్పటి వరకూ ఏడుగురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్టయింది. ఇంకా ఆరుగురి మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతుండటంతో మృతుల కుటుంబీకులకు పడిగాపులు తప్పడం లేదు. ఎన్‌కౌంటర్లు జరిగి రోజులు గడుస్తున్నా నేటికీ మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించకుండా జాప్యం ప్రదర్శిస్తున్నారని, మృతదేహాలు పాడైతే తమ వారిని కడచూపు చూసేందుకూ వీలుండదని మృతుల కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, బీజాపూర్ ప్రాంతాల నుంచి వచ్చామని, అక్కడకు వెళ్లాలంటే సుమారు 10 నుండి 15 గంటల సమయం పడుతుందని, ఈ దృష్ట్యా పోస్టుమార్టం త్వరగా చేయాలని కోరుతున్నారు. శుక్రవారమూ రంపచోడవరం ఆస్పత్రి వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి.

బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు గడువు వుండాల్సిందే : స్టాలిన్

చెన్నై : రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు క్లియర్ చేయడానికి గడువు విధించే వరకూ విశ్రమించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ స్పష్టం చేశారు. గవర్నర్లకు కాలపరిమితి నిర్ణయించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను సవరించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టాలిన్ ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు చేశారు. రాష్ట్రపతి ప్రశ్నలకు సమాధానంగా సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు ఈ ఏడాది ఏప్రిల్ 8న అదే కోర్టు వెల్లడించిన ఆదేశాలపై 'ప్రభావం చూపదు' అని స్టాలిన్ తెలిపారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిరవధికంగా నిలిపివేసిన పది బిల్లులు ఆమోదం పొందినట్లుగానే భావించాలని ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రాల హక్కులు, నిజమైన సమాఖ్యవాదం కోసం డిఎంకె పోరాటం కొనసాగుతుందని స్టాలిన్ స్పష్టం చేశారు. "తమిళనాడు గవర్నర్‌తో సహా ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వాలతో విభేదిస్తున్న దేశంలోని గవర్నర్లపై మా న్యాయ పోరాటం కొనసాగుతోంది. ఎన్నికైన ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేయాలని, ప్రజాభీష్టానికి జవాబుదారీగా ఉండాలని గవర్నర్లపై ఒత్తిడి తీసుకొస్తాం' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు కార్యనిర్వాహక అధికార కేంద్రాలు ఉండకూడదని, రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్నవారు రాజ్యాంగ చట్రంలోనే వ్యవహరించాలని, రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరించకూడదని ధర్మాసనం పునరుద్ఘాటించిందని తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రద్దు చేయడానికి లేదా పాకెట్ వీటోను ఉపయోగించడానికి గవర్నర్‌కు నాలుగో ఎంపిక లేదని కూడా సుప్రీంకోర్టు కూడా పునరుద్ఘాటించిందని స్టాలిన్ తెలిపారు. గవర్నర్ సుదీర్ఘమైన, నిరవధిక జాప్యం చేసిన సందర్భాల్లో, రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించవచ్చునన్నారు. ఏ రాజ్యాంగ అధికారం కూడా రాజ్యాంగానికి అతీతంగా కాదని తాను నమ్ముతున్నానని, రాజ్యాంగం ద్వారా ఎన్నికైన వారే రాజ్యాంగాన్ని ఉల్లంఘించినప్పుడు, కోర్టులు తలుపులు మూసివేయకూడదని తెలిపారు.

భారత చమురు కంపెనీలపై యుఎస్ ఆంక్షలు

- ఇరాన్‌తో వాణిజ్య ప్రభావం
- రష్యా నుంచి దిగుమతులు నిలిపివేత



న్యూఢిల్లీ : ఇరాన్‌తో చమురు వ్యాపారంపై అమెరికా ఇటీవల విధించిన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కొంటున్న కంపెనీల్లో భారత్‌కు చెందినవి కూడా ఉన్నాయి. అమెరికా విదేశాంగ శాఖ మొత్తం 17 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన టిఆర్6 పెట్రో కంపెనీ, ఆర్‌ఎన్ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థలతో పాటు కొంతమంది వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయి. ఇందులో టిఆర్6 పెట్రో ఇండియా అక్టోబర్ 2024, జూన్ 2025 మధ్య ఇరాన్ నుండి 80 లక్షల డాలర్లకు పైగా విలువైన బిటుమెన్‌ను దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. ఇది మహారాష్ట్ర కేంద్రంగా పని చేస్తోంది. దీనితో పాటు భారతీయ పౌరులైన జైర్ హుస్సేన్ ఇక్బాల్ హుస్సేన్ సయ్యద్, జుల్ఫికర్ హుస్సేన్ రిజ్వీ సయ్యద్ కూడా ఆంక్షలు ఎదుర్కొంటున్న వారిలో ఉన్నారు. అమెరికా ప్రభుత్వం ఇరాన్ ముడి చమురును వివిధ దేశాలకు సరఫరా చేయకుండా అడ్డుకొనేందుకు పలు సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు చెందిన ప్రముఖ ప్రయివేటు ఎయిర్‌లైన్స్, మహాన్‌ఎయిర్, యాజ్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్వేస్‌పై కూడా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఈ విమానయాన సంస్థలు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జిసి)తో సన్నిహితంగా పని చేస్తున్నాయని యుఎస్ ఆరోపిస్తోంది. అమెరికా ఏకపక్ష ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థిక ఒత్తిడిలో పడిపోయే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు.

రష్యా చమురు దిగుమతులను నిలిపివేసిన రిలయన్స్

అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యన్ చమురు దిగుమతులను నిలిపివేసినట్లు ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ పేర్కొంది. గుజరాత్‌లోని రిఫైనరీ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) జామ్‌నగర్‌లో ఉన్న తమ ఎగుమతి ఆధారిత రిఫైనరీలో నవంబర్ 20 నుండి రష్యన్ ముడి చమురు దిగుమతులను ఆపేసినట్లు పేర్కొంది. రష్యా చమురుపై అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఇయు) విధించిన తీవ్ర ఆంక్షల నేపథ్యంలో రిలయన్స్ ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 1 నుండి తమ జామ్‌నగర్ సెజ్ రిఫైనరీ నుండి ఎగుమతి అయ్యే అన్ని ఇంధన ఉత్పత్తులు రష్యాయేతర ముడి చమురును ఉపయోగించి తయారు చేయబడతాయని పేర్కొంది. అయితే.. నవంబర్ 20 తర్వాత వచ్చే ఏవైనా రష్యన్ చమురు కార్గోలు దేశీయ వినియోగం కోసం ఉద్దేశించిన రిఫైనరీకి మళ్లించబడతాయని పేర్కొంది. రిలయన్స్ ఎగుమతుల్లో యూరప్ దేశాలు 28 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రిలయన్స్ వాస్తవానికి రష్యన్ రాస్నెఫ్ట్‌తో 25 సంవత్సరాల వాణిజ్య ఒప్పందం కలిగి ఉన్నప్పటికీ అమెరికా, ఇయు ఆంక్షలతో దీన్ని ముందే రద్దు చేసుకోవాల్సి వచ్చింది. భారతదేశం రష్యా నుంచి రోజుకు 17-18 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుండగా.. ఇందులో దాదాపు సగం రిలయన్స్ ఒక్క సంస్థనే కొనుగోలు చేస్తోంది.

కార్మిక హక్కులపై శరాఘాతం

(మొదటిపేజీ తరువాయి)

మొదలైన ప్రయోజనాలను వేతనాల నిర్వచనం నుంచి మినహాయించారు. ఈ మినహాయింపులను మొత్తం వేతనంలో యాభై శాతానికి పరిమితం చేశారు (గ్రాట్యుటీ, రిట్రెంచ్‌మెంట్ పరిహారాన్ని ఇందులో చేర్చలేదు). ఫలితంగా ఉద్యోగుల ప్రయోజనాలు, యజమానుల ఖర్చులపై ప్రభావం పడుతుంది. అంతేకాదు...వేతనాలకు ఇచ్చిన కొత్త నిర్వచనం గ్రాట్యుటీ ఖర్చుపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుత, భవిష్యత్ ఉద్యోగులందరికీ కొత్త నిర్వచనం ప్రకారం గ్రాట్యుటీని చెల్లిస్తారు. గ్రాట్యుటీకి అర్హత పొందగోరే ఉద్యోగుల సర్వీసు కాలాన్ని ఐదు సంవత్సరాల నుంచి ఏడాదికి తగ్గించారు. అంటే ఉద్యోగులు ఒక సంవత్సరం పాటు సర్వీసులో ఉంటే వారిని గ్రాట్యుటీ లభిస్తుంది. అయితే ఇక్కడ ఓ తిరకాసు ఉంది. నిర్దిష్ట కాలానికి నియమించబడే ఉద్యోగులకే ఈ ప్రయోజనం వర్తిస్తుంది. శాశ్వత ఉద్యోగులకు గతంలో మాదిరిగానే ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుంటేనే గ్రాట్యుటీ లభిస్తుంది.

సమస్యల పరిష్కారంలో వైఫల్యం

సంపద పంపిణీ చేయకుండా ఆర్థిక వృద్ధిపై దృష్టి సారిస్తే నిరుద్యోగం పెరుగుతుందని గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. దీనివల్ల కార్మికులు, కార్మిక సమాజాలు పేదరికంలో కూరుకుపోతాయి. వారిలో అభద్రతాభావం కన్పిస్తుంది. ఆర్థికంగా దెబ్బతింటారు. లేబర్ మార్కెట్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమస్యలను పరిష్కరించడంలో లేబర్ కోడ్లు విఫలమయ్యాయి. ఫలితంగా సమాజంలో శాంతి, సామరస్యానికి విఘాతం కలుగుతుంది. కార్మికుల జీవన స్థితిగతులలోనూ, పని పరిస్థితులలోనూ ఎలాంటి మార్పులు జరగవు. కోట్లాది కార్మికుల ప్రాథమిక హక్కులను తిరస్కరించడం రాజ్యాంగానికి విరుద్ధం. దీర్ఘకాలిక వృద్ధి నమూనా యొక్క స్థిరత్వంపై ప్రభావం పడుతుంది.

హక్కులకు పరిమితులు

ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల ద్వారా కార్మికులకు లభిస్తున్న రక్షణ తాజా లేబర్ కోడ్లతో నీరుకారిపోతుంది. కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతుంది. లేబర్ కోడ్లు కాంట్రాక్ట్, వలస కార్మికుల హక్కులను బలహీనపరుస్తాయని విమర్శకులు చెబుతున్నారు. కార్మికులకు సమ్మె చేసే హక్కుపై పరిమితులు ఉంటాయి. సమ్మె చేయాలంటే అరవై రోజుల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. మహిళలు, అసంఘటిత రంగంలో పని చేసే కార్మికుల నిర్దిష్ట అవసరాలను పట్టించుకునే నాథుడే ఉండడు. ముఖ్యంగా చిన్న చిన్న సంస్థలలో పని చేసే వారికి ఎలాంటి రక్షణ లభించదు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న లింగ వివక్షను, అసమానతలను నివారించేందుకు లేబర్ కోడ్లలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పైగా సమస్యలు మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం కూడా ఉంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలకు ప్రసూతి ప్రయోజనాలు కూడా కల్పించే పరిస్థితులు ఉండవు. ఇ-రిజిస్ట్రేషన్, ఆధార్‌తో ముడిపడిన ప్రయోజనాలు వంటివి డిజిటల్ పరిజ్ఞానం లేని కార్మికులకు ప్రతిబంధకంగా మారతాయి. మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడంతో వారు ఈ ప్రయోజనాలను పొందడంలో సమస్యలు ఎదుర్కొంటారు. కార్మిక కోడ్లను రూపొందించే సమయంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను, ఇతర భాగస్వాములను సరిగా సంప్రదించలేదు. దీంతో అవి కార్మికుల అవసరాలను పూర్తిగా తీర్చలేకపోయాయి. సామాజిక భద్రతా కోడ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలను ప్రస్తావించారు. అయితే అవి గందరగోళానికి దారి తీసే అవకాశం ఉంది.



తమిళనాడులో మెట్రో ప్రాజెక్టులపై కేంద్రం వివక్ష

- వ్యతిరేకంగా సిపిఎం భారీ ర్యాలీ

కోయంబత్తూరు : తమిళనాడులోని మెట్రో ప్రాజెక్టులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు లౌకిక ప్రగతిశీల కూటమి పార్టీలతో కలిసి సిపిఎం కోయంబత్తూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తమిళనాడు అభివృద్ధి ప్రయోజనాలకు ద్రోహం చేసిందని ఈ ర్యాలీలో పాల్గొన్న నాయకులు విమర్శించారు. సిపిఎం కోయంబత్తూరు జిల్లా కార్యదర్శి సి.పద్మనాభన్ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరు, మధురైలకు ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఇటీవల తిరస్కరించింది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, కాన్పూర్ వంటి చిన్న నగరాలకు కూడా మెట్రో రైలు ప్రాజెక్టులకు మోడీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పాక్‌లో బాయిలర్ పేలి 15 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ఫైసలాబాద్‌లో ఓ గ్లూ(గమ్) తయారుచేసే ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడులో 15 మంది మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 'ఇప్పటివరకు, సహాయక బృందాలు శిథిలాల నుండి 15 మృతదేహాలను వెలికితీశాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు' అని ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ రాజా జహంగీర్ అన్వర్ విలేకరులకు తెలిపారు.

మయన్మార్ బాధితులు స్వస్థలాలకు చేరుకునేందుకు సాయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మయన్మార్ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ నుంచి రక్షించిన బాధితులను ఎపి భవన్ అధికారుల బృందం కేంద్ర ప్రభుత్వ అధికారుల నుంచి ఆధీనంలోకి తీసుకుని సురక్షితంగా ఢిల్లీలోని ఎపి భవన్‌కు శుక్రవారం తరలించింది. మయన్మార్ నుంచి రక్షించిన 370 మంది భారతీయులను 3 విమానాల్లో ఢిల్లీకి తీసుకురాగా, వీరిలో 55 మంది రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు చెందినవారు ఉండగా, వీరికి తోడుగా 8 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. వీరికి తాత్కాలిక వసతి కల్పించి, ఆహారం అందించారు. మయన్మార్‌లో వీరి ఫోన్లు స్వాధీనం చేసుకున్నందున వారి వద్ద స్వగ్రామం వెళ్లడానికి డబ్బులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులకు తక్షణ సాయంగా రూ.వెయ్యి చొప్పున నగదు అందజేసింది. వీరు స్వస్థలాలకు వెళ్లేందుకు వీలుగా ఎమర్జెన్సీ కోటాలో విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం మయన్మార్ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ నుంచి 79 మందిని స్వదేశానికి తిరిగి వచ్చిన వారిని ఇళ్లకు చేరుకోవడానికి సాయమందించింది.

కళాశాలల్లో ఆత్మహత్యల నివారణకు ఐదుగురితో కమిటీ

- విద్యాశాఖ సమీక్షలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు. ఇంటర్మీడియట్, పాఠశాల విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులతో కలిసి ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమా నేతృత్వంలో ఈ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ రెసిడెన్షియల్ కళాశాలల్లో సౌకర్యాల మెరుగు, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనుమతుల్లేకుండా నడిచే ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చి ఐఐటి, ఎన్ఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల సీట్లు సాధించేలా చూడాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్వదేశంతో పాటు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలన్న ఆసక్తిగల విద్యార్థినులకు 'కలలకు రెక్కలు' పథకం కింద సాయం అందిస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతించే అంశంపై చర్చించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలతో కొలాబరేషన్‌కు ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ, జేమ్స్‌కుక్ యూనివర్సిటీ, న్యూక్యాజిల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ అసెంబ్లీ (మాక్ అసెంబ్లీ)ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ స్కూల్ అసిస్టెంట్ టీచర్లను మార్చిలో సింగపూర్ పంపుతామన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల, పాఠశాల, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం రక్షణ, పరిరక్షణకు ఎన్‌బిఎ రూ.39.84 కోట్లు విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎర్ర చందనం రక్షణ, పరిరక్షణ కోసం రాష్ట్రానికి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ (ఎన్‌బిఎ) రూ.39.84 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశ జీవవైవిధ్య పరిరక్షణ ప్రయత్నాలకు పెద్ద ప్రోత్సాహకంగా రాష్ట్ర అటవీశాఖకు రూ.38.36 కోట్లు, ఎర్ర చందనం పరిరక్షణ, సంరక్షణకు రాష్ట్ర జీవవైవిధ్య బోర్డుకు రూ.1.48 కోట్లు విడుదల చేసింది. తూర్పు కనుమలలో ఉన్న అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో ఎర్రచందనం సహజంగా పెరుగుతుంది. రాష్ట్ర అటవీశాఖ వేలం వేసిన లేదా స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనం ప్రయోజన-భాగస్వామ్య మొత్తంగా నియంత్రిత యాక్సెస్‌తో రూ.87.68 కోట్లు వచ్చింది. ఇప్పటి వరకూ ఎర్రచందనం పరిరక్షణ, సంరక్షణ, పరిశోధన కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా అటవీ శాఖలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డుకు రూ.49 కోట్లకు పైగా ఎన్‌బిఎ విడుదల చేసింది. అదనంగా రాష్ట్రంలోని 198 మంది రైతులకు రూ.3 కోట్లు, తమిళనాడులోని 18 మంది రైతులకు రూ.55 లక్షలు ఇచ్చింది. ఎన్‌బిఎ ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యాన రూ.2 కోట్ల వ్యయంతో లక్ష ఎర్రచందనం మొక్కలను పెంచాలని నిర్ణయించింది. ఈ మొక్కలను తరువాత రైతులకు సరఫరా చేస్తారు. ఇది ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ (టిఓఎఫ్) కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తుంది.

శాంతి కోసం మణిపూర్‌లో ఆందోళనలు

- ముగ్గురికి గాయాలు

ఇంఫాల్ : శాంతి, స్వేచ్ఛా కదలికల కోసం మణిపూర్‌లో ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాజధాని ఇంఫాల్‌లో జరిగిన మార్చ్‌ను భద్రతా సిబ్బంది లాఠీఛార్జి, టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించి చెదరగొట్టారు. ఈ ఘటనలో ముగ్గురు ఆందోళనకారులు గాయపడ్డారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఆందోళనకారులు రాజ్‌భవన్ వైపు మార్చ్‌గా వెళుతుండగా మార్గమధ్యలో భద్రతాసిబ్బంది బారికేడ్లతో అడ్డుకున్నారు. ఆందోళనకారులు ఈ బారికేడ్లను దాటి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా వారిపై సిబ్బంది లాఠీఛార్జి చేశారు.

కాగా, రెండేళ్లుగా నిలిచిపోయిన మణిపూర్ సంగై ఫెస్టివల్‌ను ఈ ఏడాది నుంచి పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఫెస్టివల్ ప్రారంభానికి ఒక రోజు ముందు ఈ ఆందోళనలు జరిగాయి. ఇలాంటి వేడుకలకు ముందుగా హింసాకాండతో నిరాశ్రయులైన ప్రజలు వారి ఇళ్లకు సురక్షితంగా తిరిగి వచ్చేలా చూడాలని, మణిపూర్ అంతటా శాంతిని, సాధారణ స్థితిని తీసుకురావాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

కేరళలో ఎస్ఐఆర్‌పై స్పందించండి

(మొదటిపేజీ తరువాయి)

తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. ఎస్ఐఆర్ రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం రాష్ట్ర కమిటీ తన పిటిషన్‌లో పేర్కొంది. కెపిసిసి అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, ముస్లిం లీగ్ ప్రధాన కార్యదర్శి పికె కున్హాలికుట్టి, ఉత్తరప్రదేశ్, పుదుచ్చేరి నుంచి వచ్చిన పిటిషన్లపై కూడా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. కేరళలో ఎస్ఐఆర్ అమలుపై తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.

ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌పై డిసెంబర్‌లో విచారణ

ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన మిగిలిన పిటిషన్లను డిసెంబర్ మొదటి లేదా రెండవ వారంలో విచారణకు స్వీకరించాలని ధర్మాసనం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టు ఇప్పటికే విచారిస్తోంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ డిఎంకె, పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ నాయకులు, తృణమూల్ కాంగ్రెస్ నాయకులు వరుసగా దాఖలు చేసిన పిటిషన్లపై ఎన్నికల సంఘం ప్రతిస్పందనను ఈ నెల 11న సుప్రీంకోర్టు కోరింది.

కుప్పకూలిన రూపాయి..

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం అమాంతం పెరిగిపోనుంది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వారాంతం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 401 పాయింట్లు లేదా 0.47 శాతం పతనమై 85,232కు జారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 124 పాయింట్లు లేదా 0.47 శాతం తగ్గి 26,068 వద్ద ముగిసింది.

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఏ స్థాయిలో ఉండాలన్న దానిపై ఏ లక్ష్యం పెట్టుకోలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. గురువారం ఆయన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లతో తలెత్తిన వాణిజ్య అనిశ్చితి పరిస్థితులతోనే రూపాయి ఒత్తిడికి గురి అవుతుందన్నారు. రూపాయి అనేది ఓ ఆర్థిక సాధనమని, డాలర్లకు డిమాండ్ ఉన్నప్పుడు రూపాయి విలువ తగ్గడం సాధారణమేనని వ్యాఖ్యానించడం గమనార్హం.

అమ్మ లాంటి చెట్లు



పిల్లల కోసం చెట్లు
పిట్టల కోసం చెట్లు

ఆటల కోసం చెట్లు
ఆరోగ్యం కోసం చెట్లు

గువ్వల కోసం చెట్లు
గూళ్ళ కోసం చెట్లు

సేదదీరడానికి చెట్లు
స్వచ్ఛమైన గాలికి చెట్లు

కోతి కొమ్మచ్చికి చెట్లు
దొంగా పోలీస్‌కి చెట్లు

కలప కోసం చెట్లు
కాయ, పండ్లకు చెట్లు

ఉయ్యాలకు చెట్లు
ఊత కర్రకు చెట్లు

చల్లని గాలికి చెట్లు
వర్షపు నీటికి చెట్లు

పచ్చదనానికి చెట్లు
పర్యావరణ రక్షణకి చెట్లు

ప్రకృతిలో భాగం చెట్లు
ప్రగతి పథానికి మెట్లు

ఆకు పచ్చని చెట్లు
అమ్మలాంటి చెట్లు

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

గెలుపు పిలుపు



కోయిల పలుకే తేనెలు
చిలుకు
తారల తళుకే కాంతులు
వొలుకు
హంసల కులుకే కళలే చిందు
హింసల మాపే శాంతే మందు


కాకుల కలయికే ఐక్యత తెలుపు
చీమల శ్రమే క్రమశిక్షణ తెలుపు
తాబేలు నడకే గెలుపుకు మలుపు
కుందేలు పడకే ఓటమి పిలుపు

ఓర్పు నీకుంటే నీదే విజయం
నేర్పు నీకుంటే నీదే ప్రభంజనం
వైవిధ్యం నీదైతే అద్భుత విజయం
వైరుధ్యం నీకుంటే తప్పదు పతనం

నమ్మకం నీకుంటే నీదే ఘన విజయం
ఆ నమ్మకమే లేకుంటే సదా పరాభవం
పరిశ్రమిస్తే ఓ నేస్తం సమస్తం నీ సొంతం
విశ్రమిస్తే ఓ నేస్తం సమస్తం అన్యాక్రాంతం

– గుండాల నరేంద్రబాబు,
తిరుపతి, 94932 35992.

నేను గీసిన బొమ్మ





కొత్తపల్లి అవని,
5వ తరగతి,
శ్రీ పాటిబండ్ల
సీతారామయ్య హై స్కూల్,
లక్ష్మీపురం, గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వృక్ష సిద్ధుడు..





జీవితంలో ఎదురయ్యే విషాదాల నుండి అంత తొందరగా కోలుకోలేరు. దాన్నుంచి ఉపశమనం పొందడం అంత ఆషామాషీ కాదు. అయితే ఓ పెద్దాయన మాత్రం దాన్ని అధిగమించాడు. తమిళనాడు రాజవల్లిపురానికి చెందిన అర్చునన్‌కి ఆడుతూపాడుతూ తిరుగుతున్న ఏడాదిన్నర కొడుకు 2003లో అకస్మాత్తుగా చనిపోయాడు. ఈ దు:ఖం అతని కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. అయితే దాని నుండి ఉపశమనం పొందేందుకు కొడుకుకి గుర్తుగా అర్చునన్ తన ఇంటి ముందు ఓ వేపచెట్టు నాటాడు. అది ఇప్పుడు పెరిగి పెద్దదై అంతెత్తున నిలబడింది. దాని నీడలో కూర్చొన్న అర్చునన్ ఇప్పుడు ఆ ఊరి అందరికి స్ఫూర్తివంతమైన ప్రయాణం చేస్తున్నాడు. కొడుకు జ్ఞాపకార్థం వేపమొక్క నాటిన అర్చునన్ అంతటితో ఆగలేదు. దశాబ్దాలుగా వేల కొలది మొక్కలు నాటడం, వాటి పెరుగుదలకి సరికొత్త విధానాలని అవలంబిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఈ కృషి అతన్ని ప్రశంసలు, అవార్డులకే పరిమితం చేయడం లేదు. అంతకు మించిన ఆత్మసంతృప్తితో ముందుకు తీసుకెళ్తోంది.

తిరునల్వేలి రైల్వే స్టేషనులో టీ అమ్ముకుంటున్న 55 ఏళ్ల అర్చునన్ గురించి ఇప్పుడు ఆ ప్రాంతంలో తెలియని వారు లేరు. 2003లో తన ఇంట్లో వేప మొక్క నాటడంతో మొదలైన ఆయన ప్రయాణం 2012 వచ్చేసరికి వేలకొలది మొక్కలను సంరక్షించేంత స్థాయికి ఎదిగింది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే కన్యాకుమారి నుండి నీలగిరి వరకు ఉన్న అన్ని జిల్లాల ప్రజలు తమ ప్రాంతంలో మొక్కల సంరక్షణ చేయాలంటే అర్చునన్‌ని తీసుకెళు్తున్నారు. అతను అవలంబించే విధానాలు కనుమరుగవ్వకుండా ఉండేందుకు అర్చునన్ ఏకంగా 10 వేల మంది విద్యార్థులకి శిక్షణ కూడా ఇస్తున్నాడు.

మొక్కలు త్వరితగతిన వేగంగా పెరిగేందుకు అర్చునన్ 'పతియం' అనే పద్ధతిని అభివృద్ధి చేశాడు. ఇదే అతన్ని ప్రత్యేకంగా నిలబెట్టింది. స్థానికులు ఆయన్ని 'వృక్ష సిద్ధ' అని పిలుస్తారు. ఏపుగా పెరిగిన పెద్ద పెద్ద వృక్షాల నుండి 8 అడుగుల కొమ్మలని కత్తిరించి, వాటికి పాత చీరలు, కొబ్బరిపీచు చుట్టి మట్టిలో భద్రపరుస్తాడు. సమయానికి నీళ్లు పోస్తూ బిడ్డని పెంచినంత శ్రద్ధగా దాన్ని సంరక్షిస్తాడు. ఫలితంగా రెండు వారాల్లో అది చిగుర్లు వేస్తుంది. 90 రోజులకి బలమైన వ్రేళ్లు రూపుదిద్దుకుని నాటేందుకు వీలుగా తయారవుతాయి. ఇదంతా చేయడం ఎందుకు విత్తనాలు నాటితే సరిపోతుంది కదా? అని ఎవరికైనా అనుమానం రావచ్చు. ఈ ప్రశ్నకి అర్చునన్ 'విత్తనాలు నాటితే మొక్క ఇంత ఎత్తు పెరగడానికి రెండేళ్లు పడుతుంది. ఈ విధానం వల్ల మూడు నెలలకే మొక్క నేలలో నాటుకుని చిగుర్లతో పునరుజ్జీవనమవుతుంది' అని సమాధానం చెబుతున్నాడు.

ఫ్యాబ్రిక్ చీరలు చుట్టడం వల్ల నీళ్లు పోసినప్పుడు తేమ తొందరగా ఆరిపోదు. ఇది మొక్క సంరక్షణకి కీలకంగా పనిచేస్తుంది. ఈ విధానం కోసం అర్చునన్ స్థానిక మహిళల నుండి వృథాగా పారవేసే చీరలను సేకరిస్తాడు. నదుల్లో, కాలువల్లో, చెత్తలో పడేయకుండా తనకి ఇవ్వమని అడుగుతాడు. ఎటువంటి స్వార్థం లేకుండా, తనకేమీ ప్రయోజనం రాకపోయినా మొక్కలను సంరక్షిస్తున్న అర్చునన్‌ని పలు స్వచ్ఛంద సంస్థలు అవార్డులతో సత్కరించాయి. ప్రభుత్వం తనని ప్రోత్సహిస్తే 33.33 శాతం అడవుల వృద్ధిని సునాయాసంగా సాధించవచ్చని కూడా అతను చెబుతున్నాడు. 'ప్రతి విత్తనం అడవి నుండే వస్తుంది'. దు:ఖాన్ని మార్పు దిశగా మార్చుకుని ప్రయాణం చేస్తున్న అర్చునన్‌కి ఆ సూక్తి సరిగ్గా సరిపోతుంది కదూ!




తొక్కలు పారేయొద్దు ...

పండ్లు, దుంపలు, కూరగాయల తొక్కను తీసేసి తినడం ఇప్పుడు సర్వసాధారణం. దీనికి కారణం పరిశుభ్రత ఒకటైతే, రసాయన ఎరువుల వాడకంతో పండిస్తున్న పంటలూ మరో కారణం. అయితే ఈ ఆహార పదార్థాలను వండే ముందు ఉప్పుతో కడిగితే ఆ రసాయనాల అవశేషాలను తొలగించవచ్చు. కానీ పైనున్న తొక్కను తొలగించి తినడం వల్ల ఆరోగ్యానికి అందవలసిన కొన్ని ప్రయోజనాలను దూరం అవుతున్నాయి. నిజానికి తొక్కల్లో చాలా పోషక పదార్థాలు ఉంటాయి. వాటిని వివిధ రూపాల్లో ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. మరి వాటిని ఎలా తీసుకోవాలి? చూద్దాం.

- నోటికి ఏ రుచీ సహించనప్పుడు నిమ్మకాయ, చింతకాయ పచ్చళ్లు తినాలనిపిస్తుంది. రుచికంటే వీటికుండే వాసనే దానికి సగం కారణం. నిమ్మ, నారింజ చెక్కులో ఉండే మోనోటెర్‌పాన్స్ నూనెలు ప్రత్యేక వాసనలని వెదజల్లుతాయి. వీటికి చర్మ, కాలేయ, గర్భాశయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లని నివారించే శక్తి ఉంది. పచ్చళ్ల రూపంలో ఇప్పటికే వీటిని తింటున్నాం.
- పచ్చళ్లు వద్దనుకునే వాళ్లు నిమ్మతొక్కలతో చేసిన టీని తాగొచ్చు. కేకులు, సలాడ్లలో లెమన్ పీల్ పొడిని చల్లుకున్నా రుచిగానే ఉంటుంది. పదార్థాలని ఉడికించేటప్పుడు, మఫిన్స్, బిస్కట్లలో కూడా ఈ పొడర్‌ని వాడుతుంటారు.
- పుచ్చకాయ ముక్కలు అంటే ఎర్రని గుజ్జే అనుకుంటాం. కానీ అడుగున ఉండే తెల్లని పదార్థంలో పోషకాలు పుష్కలం. దాన్లో సిట్రులిన్ అనే పోషక పదార్థం ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచే అమినోయాసిడ్లు, విటమిన్–సి, విటమిన్–ఎ, థయామిన్, రైబోఫ్లెవిన్... రక్తహీనత రాకుండా చూసే ఇనుము, మెగ్నీషియమ్, ఎముకల బలానికి తోడ్పడే క్యాల్షియం ఉంటాయి. పోషకాలు అపారం కాబట్టి జ్యూస్ తయారు చేసేప్పుడు కాస్త లోతుగా కట్ చేయడం వల్ల తెలుపు రంగు పదార్థాన్నీ మిక్సీలో వేయొచ్చు.
- ఎర్రెర్రని దానిమ్మ గింజల్లో కంటే దాని పొట్టులో రెండు రెట్లు ఎక్కువగా శక్తివంతమైన పోషకాలుంటాయి. కానీ దానిని తినడం మనవల్ల అయ్యే పనికాదు. అందుకే దానిని ఎండబెట్టి పొడి చేసుకొని టీ చేసుకోవచ్చు.
- తీపి గుమ్మడి పులుసు పెట్టినప్పుడు చెక్కు తీయకుండా, దాంతో పాటే వండుకోవాలి. ఎందుకంటే దానిలో ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా చేసే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి.
- బంగాళదుంపలపై ఉండే పొరలో విటమిన్–సి, బి6, పొటాషియమ్, మాంగనీస్ పోషకాలు ఉంటాయి. అందుకే ఆలూతో చేసే వంటల్లో సాధ్యమైనంత వరకూ పొట్టు తీయకుండా ఉంటే సరిపోతుంది. అయితే ఉప్పునీళ్లతో ఒకటికి రెండుసార్లు శుభ్రంగా కడగాలి.

అభిమానుల ఆదరణ గర్వంగా ఉంది : భాగ్యశ్రీ బోర్సే




'కాంత' సినిమాలోని నా పర్ఫార్మెన్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా అనిపించింది. ప్రేక్షకులు నటిగా నాలో ఉన్న పొటెన్షియల్ చూశారు. చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. ఇది ఆరంభం మాత్రమే. ఇందులో నేను మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాలేజ్ గోయింగ్ గర్ల్‌గా హీరో సాగర్‌తో ప్రేమలో ఉంటుంది. కథలో నా క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్. ఈ క్యారెక్టర్ ఆడియన్స్ గుర్తుపెట్టుకునేలా ఉంటుంది. నేను నార్త్ నుంచి సౌత్‌కి వచ్చినప్పుడు ఇక్కడ అభిమానుల అభిమానం చూసిన తర్వాత ఒక స్టార్‌ని ఎంత గొప్పగా ఆరాధిస్తారో, ప్రేమిస్తారో ప్రత్యక్షంగా చూశా. అది నిజంగా చాలా గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా, పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారు అనిపించేది. దర్శకుడు ఈ కథ చెప్పిన తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది. ఉపేంద్రతో ఒక కాంబినేషన్ సీన్ ఉంది. ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉండబోతుంది. 'నువ్వుంటే చాలు, చిన్ని గుండెలో' పాటలు.. ప్రేమలో ఉన్న గొప్ప ఎమోషన్‌ని చూపించాయి. రామ్‌తో నటించడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. మైత్రీ మూవీ మేకర్స్ రవి, నవీన్‌తో కలిసి చేయటం చాలా హ్యాపీ అనిపించింది. చాలా ప్యాషన్ ఉన్న ప్రొడ్యూసర్స్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని తీశారు. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. అయితే వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి 100 శాతం ఇచ్చి ఒక వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది. అనుష్క 'అరుంధతి'లో చేసిన క్యారెక్టర్స్ చాలా ఇష్టం. అలాంటి పాత్రలు నాకు వస్తాయని ఆశిస్తున్నా' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 27న థియేటర్లలోకి విడుదల కానుంది. మహేష్‌బాబు పి.దర్శకత్వం వహిస్తున్నారు. ఉపేంద్ర కీలక పాత్రను పోషిస్తున్నారు.

23న నాగచైతన్య కొత్త సినిమా ప్రకటన



కథానాయకుడు అక్కినేని నాగ చైతన్య మరో కొత్త సినిమాలో నటించబోతున్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బీవీఎస్‌ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. 'లాపతా లేడీస్' ఫేమ్ స్పార్శ్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈనెల 23న నాగచైతన్య పుట్టిన రోజు. ఆరోజు కొత్త సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. నాగ చైతన్య కెరీర్‌లో హై బడ్జెట్ సినిమాగా ఇది ఉంటుందని పేర్కొంది. మిథ్‌కు రూటెడ్ థ్రిల్లర్‌గా, యూనిక్ నెరేటివ్ ఫ్రేమ్‌వర్క్, హై-ఇంటెన్సిటీ స్టోరీటెల్లింగ్‌తో మునుపెన్నడూ లేని అనుభూతిని ఈసినిమా అందించబోతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ షెడ్యూల్ జరుగుతోంది. ఈ చిత్రానికి సమర్పణ బాపినీడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నరసింహాచారి చెన్నోజు.

23న 'రెబల్ సాబ్' పాట విడుదల



ప్రభాస్ నటిస్తున్న 'ది రాజాసాబ్' చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ రాబోతోంది. మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా నుండి మొదటి పాట 'రెబల్ సాబ్'ను నవంబర్ 23న విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ చిత్రబృందం ఓ కొత్త పోస్టర్‌ను విడుదలచేసింది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న ఈ కథలో నటిస్తున్నారు. నిధి అగర్వాల్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 9న ఈ చిత్రం విడుదలవుతోంది.

ఓటీటీలోకి ఆస్కార్ నామినేటెడ్ 'హోంబౌండ్'



98వ అకాడమీ అవార్డ్స్ కోసం భారతదేశం నుంచి ఎంట్రీగా ఎంపికైన బాలీవుడ్ చిత్రం 'హోంబౌండ్' ఓటీటీలో ప్రసారమవుతోంది. అంతర్జాతీయంగా విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో హిందీ భాషలో స్ట్రీమింగ్ అవుతుంది. బాలీవుడ్ నటులు ఇషాన్ ఖట్టర్, జాన్వీ కపూర్, విశాల్ జేత్వా ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు. నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను కరణ్ జోహార్ నిర్మించగా.. హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు మార్టిన్ స్కోర్సెస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చందన్ కుమార్ (విశాల్ జేత్వా), మహ్మద్ షోయబ్ (ఇషాన్ ఖత్తర్) అనే ఇద్దరు చిన్ననాటి స్నేహితులు జీవితాల కథ ఆధారంగా వచ్చింది. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన వీరిద్దరూ మంచి జీవితం కోసం ఆరాటపడుతుంటారు. వారికి సమాజంలో ఎదురయ్యే వివక్ష, పేదరికం నుండి బయటపడటానికి, దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో పోలీసు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తారు. అయితే చందన్ పరీక్షలో ఉత్తీర్ణుడైతే, మహ్మద్ విఫలమవుతాడు. 2020లో కోవిడ్–19 వల్ల దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన సమయానికి, విడిపోయిన ఈ ఇద్దరు యువకుల జీవితాలు మళ్లీ కలుసుకుంటాయి. ఈ ప్రయాణంలో, వారి స్నేహం, ఆశలు, నిరాశలు, సామాజిక అసమానతలు, వ్యక్తిగత పోరాటాలు వంటి అనేక అంశాలను దర్శకుడు నీరజ్ ఘైవాన్ తెరపై చూపించారు. అట్టడుగు వర్గాల ప్రజలు గౌరవంగా, ఆనందంగా జీవించడానికి పడే కష్టాలను ఈ చిత్రం ఎంతో సున్నితంగా, వాస్తవికంగా చిత్రీకరించింది. జాన్వీ కపూర్ పోషించిన సుధా భారతి పాత్ర కూడా కథలో కీలకంగా ఉంటుంది.

పంత్ కెప్టెన్సీకి పరీక్ష

నేటినుంచి దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్
లంచ్‌కు ముందే టీ బ్రేక్
ఉదయం 9.00గం|| నుంచి



గౌహతి: తొలి టెస్ట్‌లో ఓడిన టీమిండియా రెండోటెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. టెస్ట్ సిరీస్‌ను సమం చేయాలంటే ఈ టెస్ట్ గెలుపు తప్పనిసరి. శనివారంనుంచి దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టెస్టులో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని టీమిండియా పట్టుదలగా ఉంది. మరోవైపు ఈడెన్ గార్డెన్స్‌లో సంచలన విజయంతో ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా సిరీస్ పట్టేయాలను కుంటోంది. ఈ క్రమంలో గౌహతి టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. తొలి టెస్ట్‌కు దూరమైన ఆ దేశ స్టార్ పేసర్ కగిసో రబాడ రెండో టెస్ట్‌కూ దూరమయ్యాడు. ఇక టీమిండియా రెగ్యులర్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మెడ నొప్పి కారణంగా ఈ టెస్ట్‌కు దూరం కావడంతో వికెట్ కీపర్ రిషబ్ పంత్ పగ్గాలు అందుకున్నాడు. గిల్ స్థానంలో సాయి సుదర్శన్ తుదిజట్టులో చోటు దక్కించుకున్నాడు. గౌహతిలోని బర్సపరా స్టేడియంలో ఒక టెస్ట్ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి. భారత జట్టు ఆరుగురు స్పెషలిస్టు బ్యాటర్లు, ఇద్దరు ఆల్‌రౌండర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లు, ఒక రెగ్యులర్ స్పిన్నర్‌తో బరిలో దిగే ఛాన్స్ ఉంది. ఆల్‌రౌండర్ల కోటాలో అక్షర్, జడేజా.. పేసర్ల విభాగంలో బుమ్రా, సిరాజ్‌తోపాటు స్పిన్నర్ కుల్దీప్‌కు చోటు ఖాయం. గిల్ స్థానంలో సాయి సుదర్శన్‌కు తుది జట్టులో కల్పించాలని సెలెక్షన్ కమిటీ సూచించింది. దేవ్‌దత్ పడిక్కల్‌ను పేరును పరిశీలించినా.. అంతిమ నిర్ణయం సాయి సుదర్శన్‌వైపే మొగ్గింది. సాయి, పడిక్కల్ రాకతో జట్టులో ఎడమచేతి వాటం ఆటగాళ్ల సంఖ్య మరింత పెరిగింది. దీంతో ధ్రువ్ జురెల్‌ను నాలుగో స్థానంలో ఆడిస్తే మంచిది. కోల్‌కత్తా టెస్ట్‌లో అక్షర్ పటేల్ రెండు వికెట్లు తీయడంతో పాటు 26, 17 పరుగులు చేశాడు. కానీ టీమిండియా 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక సౌతాఫ్రికా చేతిలో 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. గౌహతిలో వాతావరణ పరిస్థితుల రీత్యా అర గంట ముందే మ్యాచ్ ప్రారంభం కానుంది. అలాగే లంచ్ విరామానికి ముందు టీ సెషన్ ఉండనుంది.

బవుమా పక్కా ప్లాన్‌తో...

పక్కటెముకల గాయంతో బాధపడుతున్న రబాడ ఇంకా కోలుకోలేదని, అందుకే అతడు రెండో టెస్టు ఆడడం లేదని దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా తెలిపాడు. ఈ పిచ్ మొదట బ్యాటర్లకు ఆపై స్పిన్నర్లకు అనుకూలించేలా ఉందని, ప్రస్తుతమైతే వికెట్ చాలా తాజాగా కనిపిస్తోంది. కోల్‌కతా వికెట్ మాదిరిగా అనూహ్యంగా టర్న్ తీసుకోదని అనుకుంటున్నా. మ్యాచ్ రోజు ఉదయం మరోసారి పిచ్‌ను పరిశీలిస్తానని అన్నాడు. ఆరంభంలో పిచ్ బౌన్స్ అవుతుందని, అయితే.. మ్యాచ్ సాగే కొద్ది స్పిన్నర్లకు అనుకూలంగా మారుతుందని వెల్లడించాడు.

జట్లు(అంచనా)..

ఇండియా: పంత్(వికెట్ కీపర్, కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, జురెల్, సుందర్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.


దక్షిణాఫ్రికా: బవుమా(కెప్టెన్), రికెల్టన్, మార్క్‌రమ్, జోర్జి, స్టబ్స్, వెర్రెయనే(వికెట్ కీపర్), జాన్సెన్, ఎన్గిడి, హేర్మర్, మహరాజ్.

అవకాశం చేజారె..

- సూపర్ ఓవర్‌లో ఓడిన ఇండియా–ఎ
- ఎమర్జింగ్ ఆసియా కప్ ఫైనల్‌కు బంగ్లాదేశ్–ఎ



దోహా: ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్లోకి బంగ్లాదేశ్–ఎ జట్టు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ఇండియా–ఎ జట్టుకు ఫైనల్‌కు చేరేందుకు అవకాశం దక్కినా.. దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి ఇరుజట్లు 6వికెట్ల నష్టానికి 194పరుగులకే పరిమితమయ్యాయి. సూపర్ ఓవర్లో టీమిండియా–ఎ జట్టు తొలి రెండు బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయింది. తొలి బంతికి కెప్టెన్ జితేశ్ శర్మ బౌల్డ్ కాగా.. రెండో బంతికి అశుతోష్ క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను ఓపెనర్లు హబిబుర్(65), జిషన్(26)కి తోడు లోయర్ ఆర్డర్‌లో మెహరోబ్(48) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్లు నష్టపోయి 194పరుగులు చేసింది. ఛేదనలో బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి టీమిండియా బ్యాటర్లు విఫలమయ్యారు. 195 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(44), వైభవ్ సూర్యవంశీ(38)లు శుభారంభమిచ్చారు. జితేశ్ శర్మ(33), వధేరా(32)కి తోడు చివర్లో అశుతోష్(13) మ్యాచ్‌ను విజయతీరాలకు చేర్చారు. ఆఖరి ఓవర్లో 16 పరుగులు అవసరం కాగా.. అశుతోష్ శర్మ మూడో బంతిని సిక్సర్, ఆ తర్వాత బంతికి మిడాఫ్‌లో ఫీల్డర్ క్యాచ్ వదిలేయగా బౌండరీ వచ్చాయి. కానీ, ఐదో బంతికి క్లీన్ బౌల్డయ్యాడు. చివరి బంతికి హర్ష్ దూబే(3 నాటౌట్) మూడు రన్స్ తీయగా స్కోర్లు సమమయ్యాయి. సూపర్ ఓవర్‌లో బంగ్లా పేసర్ రిప్పన్ వరుసగా రెండు బంతుల్లో రెండు వికెట్లు తీయడంతో టీమిండియా ఓటమి ఖాయమైంది. ఆ తర్వాత బంగ్లాజట్టు తొలి బంతికి ఒక వికెట్ కోల్పోయినా.. ఆ తర్వాత బంతిని సుయాశ్ శర్మ వైడ్ వేడయంతో బంగ్లా విజయం ఖాయమైంది. దీంతో ఆ జట్టు తొలిసారి ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్లో అడుగుపెట్టింది. రెండో సెమీస్ పాకిస్తాన్–ఎ, శ్రీలంక–ఎ జట్ల మధ్య జరగనుంది.



మంధాన హల్దీ వేడుకలో వన్డే ప్రపంచ ఛాంపియన్స్

ముంబయి: భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్ఛల్‌తో మంధాన వివాహం జరగనుండగా.. శుక్రవారం జరిగిన హల్దీ వేడుకల్లో వన్డే ప్రపంచకప్ ఛాంపియన్స్ సందడి చేశారు. పసుపు డ్రెస్ కోడ్‌తో హాజరైన వరల్డ్ కప్ విజేతలు డాన్స్ చేశారు. షెఫాలీ వర్మ, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, రేణుకా సింగ్, రీచా ఘోష్ తదితరులు మంధానాతో హుషారుగా స్టెప్పులు వేశారు. వీరి వివాహం నవంబర్ 23న జరగనుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్ జరిగిన డివై పాటిల్ స్టేడియంలో పలాశ్ ముచ్ఛల్.. మంధానను వివాహ ప్రపోజల్ చేయగా.. అందుకు మంధాన ఎస్ అనడంతో ఆమె వేలికి ఉంగురం తొడిగాడు. ఆ తర్వాత భారత స్టార్ సైతం అతడికి ఉంగురం తొడిగి.. హగ్ చేసుకున్న విషయం తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68